



Truth of News
RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 77 | గురువారం 14 ఆగస్టు 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## 79వ స్వాతంత్ర్య దినోత్సవం రేపు జాతినుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం



- ఎల్లుండి ఎర్రకోట నుంచి ప్రసంగించనున్న ప్రధాని నరేంద్ర మోదీ
- దేశ రాజధాని ఢిల్లీలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు
- పలు కీలక ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధింపు
- ఉదయం 4 గంటల నుంచే మెట్రో ప్రత్యేక సర్వీసులు
- సాయుధ బలగాల బ్యాండ్ ప్రదర్శనలతో దేశభక్తి వాతావరణం

- మిగతా 2లో..

## వారి నుంచి నాకు ముప్పు ఉండొచ్చు

- పుణే కోర్టుకు తెలిపిన రాహుల్ గాంధీ
- అవసరమైన భద్రత కల్పించడం కేంద్రం బాధ్యత అన్న రాహుల్ గాంధీ
- రాహుల్ గాంధీ ఆరోపణలను కొట్టి పారేసిన పిటిషనర్ సాత్యకి

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం, ఆగస్టు 13

వీర సావర్కర్, నాథూరాం గాడ్సే భావజాలాన్ని అనుసరిస్తున్న వారి నుంచి తనకు ముప్పు పొంచి ఉండవచ్చని లోక్‌సభ



ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. సావర్కర్‌ను ఉద్దేశిస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారంటూ ఆయనపై పరువునష్టం కేసు నమోదైన విషయం విదితమే.

- మిగతా 2లో..



## గాజాలో కొనసాగుతున్న ఇజ్రాయిల్ దాష్టీకాలు

- 24 గంటల్లో మరో 89 మంది మృతి
- ఆహార కేంద్రాలపై అమానవీయ దాడులు
- ఆకలి రక్కసికి ఐదుగురు బలి

గాజా - సూర్య వాస్తవం, ఆగస్టు 13

అమెరికా అండదండలతో ఇజ్రాయిల్ సాగిస్తున్న దాష్టీకాలకు హద్దే లేకుండా పోతోంది. గాజాలో సాగిస్తున్న ఇజ్రాయిల్ అమానీయ దాడుల్లో

- మిగతా 2లో..

## భూధార్ కేటాయింపులపై దృష్టి సారించాలి

- మ్యుటేషన్ల ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి
- సౌకర్యవంతంగా ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు
- నెలాఖరులోగా ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవం : రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల సమీక్షా సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి




- మిగతా 2లో..

## ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం వేసే ప్రసక్తే లేదు

- ఏపీని 'గ్రీన్ ఎనర్జీ కారిడార్'గా తీర్చిదిద్దుతామన్న చంద్రబాబు
- వినియోగదారులపై విద్యుత్ ఛార్జీల భారం వేయొద్దని అధికారులకు ఆదేశం
- ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలపై దృష్టి సారించాలని కీలక సూచన
- పంపిణీ నష్టాలు, బహిరంగ మార్కెట్ కొనుగోళ్లు తగ్గించాలని స్పష్టం
- వ్యవసాయానికి స్మార్ట్ మీటర్లు వద్దని తేల్చిచెప్పిన ముఖ్యమంత్రి

అమరావతి- సూర్య వాస్తవం, ఆగస్టు 13

ఆంధ్రప్రదేశ్‌ను 'గ్రీన్ ఎనర్జీ కారిడార్'గా తీర్చిదిద్దాలని, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అదే సమయంలో, విద్యుత్ ఛార్జీలు పెంచి వినియోగదారులపై ఎలాంటి భారం మోపవద్దని ఆయన స్పష్టం చేశారు. బుధవారం అమరావతిలోని తన క్యాంపు కార్యాలయంలో విద్యుత్ సరఫరా, పెట్టుబడులు, ఛార్జీల తగ్గింపు వంటి కీలక అంశాలపై సీఎం



ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఏపీ ట్రాన్స్‌కో, జెన్‌కో ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రపంచవ్యాప్తంగా

- మిగతా 2లో..



## మోడీ కార్పొరేట్ విధానాలపై దేశవ్యాప్త ఆగ్రహం

- మోడీ, ట్రంప్ దిష్టి బొమ్మలు దగ్ధం
- సిఐటియు కాపీల దహనం
- దేశవ్యాప్తంగా ఆందోళనల్లో లక్షలాది మంది రైతులు, కార్మికులు - రైతుల రెట్టింపు ఆదాయం ఏదీ : ఎస్‌కెఎం నేతలు

- మిగతా 2లో..

## 'నోట్ల చోరీ' వల్లే వైసీపీ ఓటమి పాలైంది

- జగన్ 'ఓట్ల చోరీ' ఆరోపణలను తిప్పికొట్టిన మంత్రి నారా లోకేశ్
- తమకు ప్రజలతోనే అసలైన 'హాట్‌లైన్' ఉందని స్పష్టీకరణ
- మోదీ, చంద్రబాబు నాయకత్వంలో ఏపీకి తిరిగి అగ్రస్థానం
- డబుల్ ఇంజిన్ సర్కార్‌తో రాష్ట్ర ప్రగతి ఖాయమని ధీమా

అమరావతి- సూర్య వాస్తవం, ఆగస్టు 13

వైసీపీ అధ్యక్షుడు జగన్ చేస్తున్న 'ఓట్ల చోరీ' ఆరోపణలపై రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో స్పందించారు. ఎన్నికల్లో ఓటమికి సాకులు వెతకడం మానుకోవాలని, 'నోట్ల చోరీ' వల్లే ప్రజలు వైసీపీని తిరస్కరించారని ఆయన ఘాటుగా విమర్శించారు. ఈ మేరకు బుధవారం ఆయన సోషల్ మీడియా వేదికగా జగన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. తమ ప్రభుత్వానికి

2లో



## పులివెందుల, ఒంటిమిట్ట ఉప ఎన్నికలు రద్దు చేయాలి

- వైసీపీ అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి
- కేంద్ర బలగాలతో ఎన్నికలు నిర్వహించాలి

అమరావతి - సూర్య వాస్తవం, ఆగస్టు 13



పులివెందుల, ఒంటిమిట్ట ఉప ఎన్నికలు రద్దు చేయాలని, కేంద్ర బలగాల ఆధ్వర్యాన తిరిగి ఎన్నికలు నిర్వహించాలని వైసిపి అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి కోరారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు.

2లో

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## పులివెందుల, ఒంటిమిట్ట ఉపఎన్నికల రగడ..

- వైసీపీపై ఎస్ఈసీకి ఫిర్యాదు చేసిన టీడీపీ నేతలు
- ఒంటిమిట్ట, పులివెందుల ఉపఎన్నికలపై తీవ్ర దుమారం
- వైసీపీ నేతలు పోలీసులను బెదిరించారని టీడీపీ ఆరోపణ
- రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను కలిసి ఫిర్యాదు చేసిన టీడీపీ బృందం
- దౌర్జన్యానికి పాల్పడ్డ వైసీపీ నేతలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- జగన్ పాలనపై టీడీపీ నేతలు వర్ల రామయ్య, దేవినేని ఉమ తీవ్ర విమర్శలు
- మూడు దశాబ్దాల తర్వాత స్వేచ్ఛగా ఓటేశారన్న దేవినేని ఉమ

కడప- సూర్య వాస్తవం, ఆగస్టు 13

పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉపఎన్నికల సందర్భంగా వైసీపీ నేతలు అప్రజాస్వామికంగా వ్యవహరించారని, విధి నిర్వహణలో ఉన్న పోలీసు అధికారులను బెదిరించి, దూషణలకు పాల్పడ్డారని తెలుగుదేశం పార్టీ తీవ్రంగా ఆరోపించింది. ఈ మేరకు బుధవారం నాడు టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, మండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ నేతృత్వంలోని బృందం రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ)ను కలిసి ఫిర్యాదు చేసింది. వైసీపీ నేతలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని టీడీపీ



నేతలు డిమాండ్ చేశారు. అనంతరం టీడీపీ నేతలు మీడియాతో మాట్లాడి, వైసీపీ తీరును తీవ్రంగా ఎండగట్టారు.

- మిగతా 2లో..

# వారి నుంచి నాకు ముప్పు ఉండొచ్చు

(మొదటిపేజీ తరువాయి)

ఈ నేపథ్యంలో ఆయన తనకు ముప్పు పొంచి ఉండవచ్చని పుణే కోర్టుకు తెలిపారు. తనకు అవసరమైన భద్రత కల్పించడం కేంద్ర ప్రభుత్వం బాధ్యత అని పేర్కొన్నారు. 2023లో లండన్ పర్యటన సమయంలో సావర్కర్‌ను ఉద్దేశిస్తూ రాహుల్ గాంధీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో సావర్కర్ మునిమనవడు సాత్యకి సావర్కర్ ఆయనపై పరువు నష్టం దావా దాఖలు చేశారు. ఈ కేసుకు సంబంధించి ప్రాథమిక ఆధారాలు ఉన్నట్లు పోలీసులు గతంలో తేల్చారు. దీనిపై పుణేలోని ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణ ఇంకా ప్రారంభం కావాల్సి ఉంది. ఈ క్రమంలోనే రాహుల్ గాంధీ తరఫు న్యాయవాది కోర్టుకు తాజాగా ఓ దరఖాస్తును సమర్పించారు.

తనకు నాథూరాం గాడ్సే, సావర్కర్ కుటుంబాలతో సంబంధం ఉందని సాత్యకి గతంలో వెల్లడించారని, కాబట్టి ఆయన గత చరిత్రను దృష్టిలో పెట్టుకుని, ప్రస్తుత రాజకీయ వాతావరణాన్ని పరిగణనలోకి తీసుకుంటే సావర్కర్, గాడ్సే భావజాలానికి మద్దతు ఇచ్చే వ్యక్తుల నుంచి రాహుల్ గాంధీకి ముప్పు పొంచి ఉండే అవకాశాలను కొట్టిపారేయలేమని, ఇలాంటి పరిస్థితుల్లో ఆయనకు రక్షణ అవసరమని పేర్కొన్నారు. విచారణ ఆలస్యం కావడం వల్లే రాహుల్ గాంధీ ఈ అప్లికేషన్ దాఖలు చేశారని సాత్యకి సావర్కర్ ఆరోపించారు. అందులో పేర్కొన్న వాస్తవాలకు, ప్రస్తుత కేసుతో ఎటువంటి సంబంధం లేదని మీడియాతో అన్నారు.

# ‘నోట్ల చోరీ’ వల్లే వైసీపీ ఓటమి పాలైంది

(మొదటిపేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్ ప్రజలతోనే నిజమైన ‘హాట్‌లైన్’ ఉందని లోకేశ్ అన్నారు. పదేపదే తప్పుడు ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు ఫలించవని స్పష్టం చేశారు. “ఓట్ల చోరీ జరిగిందని చెప్పడం కాదు.. వరుస కుంభకోణాల్లో మీరు చేసిన నోట్ల చోరీ వల్లే ఓడిపోయారు. నేను దేని గురించి మాట్లాడుతున్నానో మీకు బాగా తెలుసు” అంటూ లోకేశ్ పరోక్షంగా మద్యం స్కామ్‌లను ఉద్దేశిస్తూ ఎద్దేవా చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలోని డబుల్ ఇంజిన్ సర్కార్ రాష్ట్ర ప్రగతికి కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు. “మా డబుల్ ఇంజిన్ ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి కట్టుబడి ఉంది. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు గారి నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌ను మళ్లీ దేశంలోనే నంబర్ 1 స్థానంలో నిలబెడతాం” అని లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించకుండా, నిరాధార ఆరోపణలు చేయడం తగదని ఆయన జగన్‌కు హితవు పలికారు.

# గాజాలో కొనసాగుతున్న ఇజ్రాయిల్ దాష్టీకాలు

(మొదటిపేజీ తరువాయి)

మంగళవారం ఉదయం 10 గంటలకు గడిచిన 24 గంటల్లో 89 మంది పాలస్తీనియన్లు మరణించారు. మరో 513 మంది గాయపడ్డారు. వీరిలో 31 మంది ఆహారం కోసం వచ్చి అశువులు బాసిన వారేనని గాజా ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. మానవతా సాయంపై తీవ్ర ఆంక్షలు అమలవుతున్న నేపథ్యంలో ఇద్దరు చిన్నారులతో సహా ఐదుగురు పాలస్తీనియన్లు కరువు బారిట పడి కన్నుమూశారని పేర్కొన్నారు. దీంతో ఆకలితో అలమటిస్తూ మరణించిన వారి సంఖ్య 227కి చేరుకోగా, వారిలో 103 మంది చిన్నారులే కావడం విచారకరం. మే27 నుండి ఆహార కేంద్రాల వద్ద దాడుల్లో మరణించినవారి సంఖ్య 1655 కాగా, 11,800మందికి పైగా గాయపడ్డారు. ఆహార పంపిణీ కేంద్రాల నుండి గాయపడి వస్తున్నవారితో ఆస్పత్రులు నిండిపోతున్నాయని, ముఖ్యంగా రక్తం, ప్లాస్మా కొరత బాగా వుందని ఐక్యరాజ్య సమితి ఆందోళన వ్యక్తం చేసింది. ఐదేళ్ళలోపు చిన్నారులు దాదాపు 12వేల మంది తీవ్ర పోషకాహార లోపంతో బాధపడుతునన్నారని జులై మాసంలో గుర్తించారు. గాజాలో నలుగురు జర్నలిస్టులను ఇజ్రాయిల్ బలగాలు హతమార్చిన నేపథ్యంలో పాలస్తీనియన్లు వారికి అంత్యక్రియలు నిర్వహించారు. కాగా ఈ హత్యలపై లండన్, బెర్లిన్, ట్యునిస్, రమల్లాతో సహా ప్రపంచవ్యాప్తంగా పలుచోట్ల ర్యాలీలు, నిరసనలు చోటు చేసుకున్నాయి. ఇయు, చైనా, జర్మనీలు ఈ దాడిని తీవ్రంగా ఖండించాయి. ఇది అంతర్జాతీయ మానవతా చట్టాన్ని తీవ్రంగా ఉల్లంఘించడమేనని ఐక్యరాజ్య సమితి వ్యాఖ్యానించింది. గాజాలో మానవతా సంక్షోభం అనూహ్యమైన స్థాయిలకు చేరిందని బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా, జపాన్, మరో 23 యురోపియన్ దేశాలు పేర్కొన్నాయి. గాజాలోకి మరింత సాయాన్ని అనుమతించాల్సిందిగా ఇజ్రాయిల్‌కు విజ్ఞప్తి చేశాయి.

# పులివెందుల, ఒంటిమిట్ట ఉప ఎన్నికలు రద్దు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికలు మొత్తం రిగ్గింగ్ జరిగాయన్నారు. వైసిపి ఏజెంట్లు లేకుండా పోలింగు ప్రక్రియ నిర్వహించారని, ఎక్కడికక్కడ ఏజెంట్ల ఫారాలు చింపేసి టిడిపి దౌర్జన్యం చేసిందని ఆరోపించారు. పోలింగు కేంద్రాల నుండి వైసిపి ఏజెంట్లను తరిమేశారని పేర్కొన్నారు. పోలీసు సహకారంతోనే అధికార పార్టీ దౌర్జన్యకాండ నిర్వహించిందని తెలిపారు. పులివెందుల జడ్‌పిటిసిలో ఆరు పంచాయతీలుంటే 700 మంది పోలీసులను నియమించారని తెలిపారు. ప్రతి పోలింగు కేంద్రం వద్ద 400 మంది టిడిపి కార్యకర్తలు అలా దాదాపు ఎనిమిది వేలమంది వచ్చారని తెలిపారు. ఇటు పోలీసులు, టిడిపి కార్యకర్తలు ఓటరుకు ఒక రౌడీ చొప్పున మోహరించారని అన్నారు. అంతా కలిసి వైసిపి నాయకులపై దాడులు, దౌర్జన్యాలు చేశారని పేర్కొన్నారు. దీన్ని ప్రజాస్వామ్య ఎన్నికలంటారా? అని ప్రశ్నించారు. మంత్రులు గ్రామాలను పంచుకున్నారని, అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఎక్కడికక్కడ తిష్టవేసి యథేచ్ఛగా దాడులు చేయించారని పేర్కొన్నారు. అయినా పోలీసులు ఏ మాత్రమూ పట్టించుకోలేదని, అధికార పార్టీకి పూర్తిగా వత్తాసు పలికారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వేర్వేరు ప్రాంతాలకు చెందిన వారు ఓటర్లుగా ఉన్న ఫొటోలను, వీడియోలను ప్రదర్శించారు. ముఖ్యమంత్రికి ఆయన పరిపాలన మీద నమ్మకం ఉంటే ఇంతటి దౌర్జన్యం చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. బూత్‌లలో వీడియో రికార్డులను బయటకు ఇస్తే అసలు విషయం బయటకు వస్తుందని అన్నారు. రిగ్గింగు కోసం పోలింగు కేంద్రాలను మార్చేశారని, ఒక ఊరివారు మరొక ఊరిలో ఓటు వేసేలా మార్పులు చేర్పులు చేశారని, మూడు, నాలుగు కిలోమీటర్లు వెళ్లి ఓటు వేసేలా కుట్రలు పన్నారని తెలిపారు. ఓటు కోసం వెళుతున్నవారిని ఎక్కడికక్కడ కొట్టారని, వేధించారని అన్నారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి నల్లపురెడ్డి పల్లెలో వందల మందితో తిష్టవేస్తే పట్టించుకోలేదని, పుత్తా చైతన్య ఈ కొత్తపల్లిలో, బిటెక్ రవి కవనంపల్లిలో తిష్ట వేసి ఓటర్లను బెదిరించారని అన్నారు. వైసిపి ఓటర్లను పోలీసులు ఇష్టం వచ్చినట్లు కొట్టారని అన్నారు. డిఐజి కోయ ప్రవీణ్.. గరికిపాటి రామ్మోహన్‌రావుకు సమీప బంధువని, ఆయన ఆధ్వర్యంలో ఎన్నికలు జరిపారని విమర్శించారు. కాల్చిపారేస్తామంటూ ఓ డిఎస్‌పి బెదిరింపులకు దిగారని వివరించారు. కోయప్రవీణ్ తెలుగుదేశం కార్యకర్తలా పనిచేశారని ఆరోపించారు. కవనంపల్లి సర్పంచ్ ఇంట్లో తుపాకీ పెట్టి మరీ బెదిరించారని అన్నారు. ఒంటిమిట్టలో మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి దౌర్జన్యం చేశారని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలతోనే నక్సలిజం పుడుతుందని పేర్కొన్నారు.

# 79వ స్వాతంత్ర్య దినోత్సవం రేపు జాతినుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం, ఆగస్టు 13**

దేశవ్యాప్తంగా 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సర్వం సిద్ధమైంది. ఈ వేడుకలను పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం (ఆగస్టు 14) జాతినుద్దేశించి ప్రసంగించనున్నారు. సాయంత్రం 7 గంటలకు ఈ ప్రసంగాన్ని ఆకాశవాణి, దూరదర్శన్ జాతీయ నెట్‌వర్క్‌లలో ప్రసారం చేయనున్నట్టు ప్రభుత్వ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. మొదట హిందీలో, ఆ తర్వాత ఆంగ్లంలో ఈ ప్రసంగం ఉంటుంది. అనంతరం దూరదర్శన్ ప్రాంతీయ ఛానెళ్లలో స్థానిక భాషల్లో ప్రసారం చేస్తారు. ఆకాశవాణి తమ ప్రాంతీయ నెట్‌వర్క్‌లపై రాత్రి 9:30 గంటలకు అనువాద ప్రసంగాలను ప్రసారం చేస్తుంది.

శుక్రవారం (ఆగస్టు 15) ఉదయం, ప్రధాని నరేంద్ర మోదీ చారిత్రాత్మక ఎర్రకోట బురుజుల నుంచి సంప్రదాయబద్ధంగా జాతినుద్దేశించి ప్రసంగిస్తారు. 1947లో బ్రిటిష్ పాలన నుంచి స్వాతంత్ర్యం పొందిన చారిత్రక ఘట్టానికి గుర్తుగా ఏటా ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా జెండా వందనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుంటారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నేపథ్యంలో దేశ రాజధాని ఢిల్లీలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఇండియా గేట్, మండి హౌస్, మథురా రోడ్ వంటి కీలక ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. పార్కింగ్ లేబుల్స్ లేని వాహనాలు ఈ మార్గాలకు దూరంగా ఉండాలని అధికారులు సూచించారు. మరోవైపు, వేడుకల్లో పాల్గొనే ప్రజలు, అతిథుల సౌలభ్యం కోసం ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ (డీఎంఆర్సీ) ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఆగస్టు 15న అన్ని లైన్లలో ఉదయం 4 గంటల నుంచే మెట్రో సేవలు ప్రారంభమవుతాయని డీఎంఆర్సీ వెల్లడించింది. ఉదయం 4 గంటల నుంచి 6 గంటల వరకు ప్రతి 30 నిమిషాలకు ఒక రైలు నడుస్తుందని, ఆ తర్వాత యథావిధిగా సాధారణ షెడ్యూల్ కొనసాగుతుందని తెలిపింది.

వేడుకల్లో భాగంగా ప్రజల్లో దేశభక్తిని నింపేందుకు ఢిల్లీలోని పలు ప్రముఖ ప్రదేశాల్లో సాయుధ దళాలు, కేంద్ర సాయుధ పోలీస్ దళాలు (సీఏపీఎఫ్), రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్), నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) బ్యాండ్లతో ప్రత్యక్ష ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

## ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం వేసే ప్రసక్తే లేదు

(మొదటిపేజీ తరువాయి)

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రాష్ట్ర విద్యుత్ రంగంలో స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. “భవిష్యత్ అంతా గ్రీన్ ఎనర్జీదే. పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించి, ఆ ప్రయోజనాలను ప్రజలకు అందించాలి,” అని ఆయన పేర్కొన్నారు. రాబోయే రెండు, మూడేళ్లలో రాష్ట్రంలో విద్యుత్ వినియోగం 8.9% పెరిగే అవకాశం ఉందని, ఈ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిని పెంచాలని సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి ఆధునిక సాంకేతికతను ఉపయోగించి అతి తక్కువ ఖర్చుతో విద్యుత్ ఉత్పత్తి చేసే మార్గాలను అన్వేషించాలని అన్నారు.

**ఛార్జీల భారం వద్దు..**
**ప్రత్యామ్నాయ ఆదాయంపై దృష్టి**

వినియోగదారులపై విద్యుత్ ఛార్జీల భారం వేసే ప్రసక్తే లేదని తేల్చిచెప్పిన సీఎం, ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను అన్వేషించాలని అధికారులకు సూచించారు. ప్రస్తుతం ఏపీ ట్రాన్స్‌కో ఆధీనంలో ఉన్న ఫైబర్ ఆప్టిక్ నెట్‌వర్క్‌ను లీజుకు ఇవ్వడం ద్వారా అదనపు ఆదాయం సంపాదించవచ్చని తెలిపారు. ఈ విధానం ద్వారా దాదాపు రూ.7 వేల కోట్ల వరకు ఆదాయం పొందే అవకాశం ఉందని అంచనా వేశారు.

బహిరంగ మార్కెట్‌లో విద్యుత్ కొనుగోళ్లను గణనీయంగా తగ్గించాలని, యూనిట్ కొనుగోలు వ్యయాన్ని రూ.4.80కి పరిమితం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని సీఎస్ విజయానంద్ ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి వివరించారు.

**నష్టాలు తగ్గించి.. కొనుగోళ్లు నియంత్రించాలి**

రాష్ట్రంలో 9 శాతంగా ఉన్న విద్యుత్ పంపిణీ నష్టాలను గణనీయంగా తగ్గించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఫీడర్లను సమర్థవంతంగా నిర్వహించడం, స్థానికంగా ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌ను అక్కడే వినియోగించడం ద్వారా ట్రాన్స్‌మిషన్ నష్టాలను అరికట్టవచ్చని అన్నారు. గతంలో తాను ప్రవేశపెట్టిన ఎనర్జీ ఆడిటింగ్ విధానాన్ని మళ్లీ అమలు చేసి విద్యుత్ చౌర్యాన్ని, నష్టాలను గుర్తించాలని సూచించారు. పెరిగే డిమాండ్‌ను ఎదుర్కొనేందుకు విద్యుత్ కొనుగోళ్లకు బదులుగా ‘పవర్ స్వాపింగ్’ వంటి విధానాలను అనుసరించాలని తెలిపారు.

**సౌర, పవన విద్యుత్‌కు పెద్దపీట**

థర్మల్ విద్యుత్ యూనిట్‌కు రూ.5 నుంచి రూ.6 ఖర్చవుతుండగా, పవన విద్యుత్‌కు కేవలం రూ.4.6 మాత్రమే వ్యయం అవుతోందని సీఎం గుర్తుచేశారు. రాష్ట్రంలో 65 గిగావాట్ల పవన విద్యుత్ ఉత్పత్తికి అవకాశాలున్నాయని, ఆ దిశగా ప్రాజెక్టులను ప్రోత్సహించాలని అన్నారు. రాయలసీమలో పంప్డ్ ఎనర్జీ ప్రాజెక్టులకు విస్తృత అవకాశాలున్నాయని పేర్కొన్నారు. పీఎం-సూర్యఘర్ సోలార్ రూఫ్ టాప్ పథకాన్ని వేగవంతం చేయాలని, ప్రతి నియోజక వర్గంలో కనీసం 10 వేల ఇళ్లకు ఈ పథకాన్ని వర్తింపజేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఈ పథకం పురోగతిపై ప్రతినెలా తానే స్వయంగా సమీక్షిస్తానని స్పష్టం చేశారు.

అలాగే, వ్యవసాయానికి ఎక్కడా స్మార్ట్ మీటర్లు బిగించవద్దని సీఎం చంద్రబాబు కచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు. పాతబడిన విద్యుత్ లైన్లను గుర్తించి, ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ‘ప్రెడిక్టివ్ మెయింటెనెన్స్’ టెక్నాలజీని వాడాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన

## మోడీ కార్పొరేట్ విధానాలపై దేశవ్యాప్త ఆగ్రహం

**న్యూఢిల్లీ- సూర్య వాస్తవం, ఆగస్టు 13** మోడీ ప్రభుత్వ కార్పొరేట్ విధానాలు, అమెరికా విధించిన 50 శాతం సుంకాలుపై దేశంలోని రైతాంగం, కార్మిక వర్గం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ విధానాలు, దేశంపై అమెరికా సుంకాల విధింపునకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలు చేశారు. ప్రధాని మోడీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు అలాగే ఇండియా-యుకె స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందం (సిఇటిఎ) కాపీలను దహనం చేశారు. బుధవారం దేశవ్యాప్తంగా సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) ఆధ్వర్యంలో ”బహుళ జాతి కంపెనీలు క్విట్ ఇండియా %-% క్విట్ కార్పొరేట్ వ్యవసాయం” ఆందోళన జరిగింది. ఈ ఆందోళనలో పది కేంద్ర కార్మిక సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలతో పాటు వివిధ సంఘాలు మద్దతుగా పాల్గొన్నాయి. దేశంలో ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, ఒరిస్సా, కర్ణాటక, త్రిపుర, జార?ండ్, హర్యానా, బీహార్, తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర, రాజస్థాన్, కేరళ, మధ్యప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో ఆందోళన జరిగింది. అనేక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నప్పటికీ రైతులు, కార్మికులు రోడ్లపైకి వచ్చి తన నిరసనను తెలిపారు. ఉత్తరప్రదేశ్‌తో వంటి రాష్ట్రాల్లో దిష్టిబొమ్మలను దగ్ధం చేయకుండా పోలీసులు అడ్డుకున్నారు. నోయిడాలో జరిగిన ఆందోళనలో ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, ఎఐకెఎస్ ఆర్థిక కార్యదర్శి కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. మోడీ, ట్రంప్ దిష్టిబొమ్మలను దగ్ధం చేయకుండా అడ్డుకోవడంతో పోలీసులకు రైతు, కార్మిక నేతలకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అయినప్పటికీ మోడీ, ట్రంప్ దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. ఆందోళనల్లో పాల్గొన్న రైతులు, కార్మికులకు ఎస్‌కెఎం అభినందనలు తెలిపింది.

2022 నాటికి రైతుల ఆదాయాలను రెట్టింపు చేస్తామని 2017లో ప్రధానమంత్రి మోడీ హామీ ఇచ్చారని, కానీ కార్పొరేట్ అనుకూల విధానాలతో పెట్టుబడి ఖర్చులను రెట్టింపు చేసి వ్యవసాయ దుస్థితిని మరింత తీవ్రతరం చేశాయని విమర్శించారు. దేశంలో ప్రతిరోజూ 31 మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని, గ్రామీణ కుటుంబాలు వలస వెళ్లాల్సి వస్తుందని అన్నారు. మొత్తం శ్రామిక ప్రజల హక్కులను కాపాడటానికి, దేశీయ ఆర్థిక వ్యవస్థను శక్తివంతమైన, పోటీతత్వంతో అభివృద్ధి చేయడానికి బదులుగా, మోడీ ప్రభుత్వం దేశంలోని సహజ, మానవ వనరులను దోచుకోవడానికి కార్పొరేట్ అనుకూల విధానాలకు కట్టుబడి ఉందని విమర్శించారు. దేశ ఆర్థిక వ్యవస్థను విదేశాలకు అప్పగించడానికి యుకె, ఈయు వంటి దేశాల ఒత్తిడికి మోడీ ప్రభుత్వం లొంగిపోయిందని విమర్శించారు. రైతులకు గిట్టుబాటు ధర, కార్మికులకు కనీస జీవన వేతనం, శ్రామిక ప్రజలను అప్పుల నుండి విముక్తి చేయడం, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయడం, వ్యవసాయ భూమిని కార్పొరేట్ దోపిడీని అంతం చేయడం, తీవ్రమైన నిరుద్యోగాన్ని పరిష్కరించడం వంటి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్లను వెంటనే అంగీకరించాలని ఎస్‌కెఎం నేతలు డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి కార్పొరేట్ అనుకూల విధానాలకు కట్టుబడి ఉండాలని నిర్ణయించుకుంటే, కార్మికులు, రైతులు ఐక్యతంగా దేశవ్యాప్తంగా దీర్ఘకాలిక, మిలిటెంట్ భారీ పోరాటాలు జరుగుతాయని ఎస్‌కెఎం నేతలు హెచ్చరించారు.

## పులివెందుల, ఒంటిమిట్ట ఉపఎన్నికల రగడ..

(మొదటిపేజీ తరువాయి)

**ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగితే జగన్ ఓర్వలేరా?: వర్ల రామయ్య**

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య మాట్లాడుతూ, “ఐదేళ్ల రాక్షస పాలనను జగన్ రెడ్డి అప్పుడే మరిచిపోయి, 15 నెలల చంద్రబాబు పాలనపై విమర్శలు చేయడం దొంగే దొంగ అన్నట్లుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో కనీసం నామినేషన్లు కూడా వేయనీయకుండా ప్రత్యర్థులపై దాడులు చేయించి, వారి ఇళ్లలో సారా సీసాలు పెట్టి అరెస్టులు చేయించిన చరిత్ర జగన్‌ది. ఇప్పుడు పులివెందుల, ఒంటిమిట్టలో ప్రజలు మూడు దశాబ్దాల తర్వాత స్వేచ్ఛగా ఓటు వేస్తుంటే తట్టుకోలేకపోతున్నారు. విధుల్లో ఉన్న పోలీస్ అధికారిని వ్యక్తిగతంగా దూషించడం, ఆయన శరీరాకృతిని కించపరచడం చట్టరీత్యా నేరం. పోలీసుల నుంచి తప్పించుకు తిరుగుతున్న ఎంపీ అవినాశ్ రెడ్డి, అధికారులను బెదిరిస్తున్న వైసీపీ నేతలపై ఈసీ వెంటనే చర్యలు తీసుకోవాలి” అని డిమాండ్ చేశారు.

**అసెంబ్లీకి రావడానికే జగన్‌కు భయం: దేవినేని ఉమ**

మాజీ మంత్రి దేవినేని ఉమ మాట్లాడుతూ, “గత 30 ఏళ్లుగా పులివెందుల, కడప జిల్లాల్లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు. ఇప్పుడు అదే జగన్ రెడ్డి ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం హాస్యాస్పదం. గతంలో వేల స్థానాలను ఏకగ్రీవం చేసుకున్న చరిత్ర వారిది. ఇప్పుడు ప్రశాంతంగా ఎన్నికలు జరిగితే రీపోలింగ్ కోసం ఒత్తిడి చేస్తున్నారు. అసెంబ్లీకి రావాలంటేనే జగన్‌కు ధైర్యం చాలడం లేదు. డీఐజీ కోయ ప్రవీణ్ ఆధ్వర్యంలో ఎన్నికలు అద్భుతంగా జరిగితే, ఆయనపై విమర్శలు చేస్తున్నారు. రేపటి ఫలితాల్లో ఓటమి ఖాయమని తెలిసే జగన్ ఈ ప్రెస్ మీట్లు పెడుతున్నారు. వివేకా హత్య కేసులో సొంత చెల్లి అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేని వ్యక్తి జగన్. పోలీసులపై బాడీ షేమింగ్ వ్యాఖ్యలు చేసిన వారిపై ఈసీ కఠిన చర్యలు తీసుకోవాలి” అని అన్నారు.

**అసలైన రాక్షస పాలన జగన్‌దే: పంచుమర్తి అనురాధ**

మండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ మాట్లాడుతూ, “31 క్రిమినల్ కేసుల్లో ఉన్న జగన్ రెడ్డి, 14 ఏళ్లు సీఎంగా పనిచేసిన చంద్రబాబుపై విమర్శలు చేయడం విడ్డూరం. ‘తల్లికి వందనం’ పథకాన్ని విమర్శిస్తున్న మీరు, అమ్మఒడి పేరుతో ప్రజలను మోసం చేశారు. మూడు రాజధానుల పేరుతో అమరావతిని నాశనం చేసి, ఇప్పుడు అభివృద్ధి చేస్తుంటే అడ్డుకుంటున్నారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి నీళ్లు అందించే ప్రయత్నాన్ని రాక్షస పాలన అనడం మీ అవివేకానికి నిదర్శనం” అని విమర్శించారు.

**వైసీపీ గుర్తింపు రద్దు చేయాలి: ఎమ్మెల్యే బోడె ప్రసాద్**

ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ, “జగన్ వ్యాఖ్యలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లున్నాయి. అధికారం కోల్పోయినా ఆయనలో అహంకారం తగ్గలేదు. అధికారులను, ముఖ్యమంత్రిని దూషిస్తున్న ఆయన మానసిక స్థితి బాగోలేదు. ఇలాంటి హింసాత్మక వ్యాఖ్యలు చేస్తున్న వైసీపీ గుర్తింపును శాశ్వతంగా రద్దు చేయాలి” అని డిమాండ్ చేశారు. ఈసీని కలిసిన వారిలో ఏపీఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ కుప్పం రాజశేఖర్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కోడూరు అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

# మోడీ తర్వాత ఎవరు...



గడిచిన 11 ఏళ్లలో బీజేపీ దేశంలో గతంలో ఎన్నడూ లేనంతం బలంగా మారింది. దేశంలోని మెజారిటీ రాష్ట్రాల్లో సొంతంగా అధికారంలో ఉంది. మిత్ర పక్షాల మద్దతుతో మరికొన్ని రాష్ట్రాల్లో అధికారంలో ఉంది. ఇక కేంద్రంలో వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చింది. మూడోసారి మెజారిటీ రాకపోయినా.. అధికారం మాత్రం చేజిక్కించుకుంది. దీనికి కారణం మోదీ మేనియా.. ఇది ఎవరూ కాదనలేరు. మోదీ కారణంగానే బీజేపీ అనేక రాష్ట్రాల్లో అధికారం చేపట్టింది. కేంద్రంలో వరుసగా మూడుసార్లు అధికారంలోకి వచ్చి రికార్డు సృష్టించింది. అయితే ఆర్‌ఎస్‌ఎస్ 75 ఏళ్లు దాటినవారు రాజకీయాల్లో రిటైర్ కావాలంటోంది. మోదీకి సెప్టెంబర్‌తో 75 ఏళ్లు పూర్తికానున్నాయి. ఈనేపథ్యంలో మోదీ తర్వాత ఎవరు అన్న చర్చ దేశవ్యాప్తంగా జరుగుతోంది. 75 ఏళ్లు తప్పనిసరి కాదని బీజేపీ అంటోంది. విపక్షాలు మాత్రం ఆర్‌ఎస్‌ఎస్ నిబంధనలు గుర్తు చేస్తున్నాయి. కౌటిల్యుడు చెప్పినట్లు, ఒక వ్యవస్థ బలంగా ఉండాలంటే, ఒక నాయకుడి అనుపస్థితిలోనూ అది సమర్థవంతంగా నడవాలి. ఈ విషయంలో బీజేపీ సిద్ధంగా ఉందా? విపక్షాల్లో మోదీకి సమానమైన నాయకుడు ఉన్నాడా?నరేంద్ర మోదీ దేశవ్యాప్త ఆకర్షణ, రాజకీయ వ్యూహం, జనసామాన్యంతో సంబంధం కలిగి ఉండే సామర్థ్యం వంటి లక్షణాలతో బీజేపీకి తిరుగులేని నాయకుడిగా నిలిచారు. 2014, 2019, 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఆయన నాయకత్వం బీజేపీకి అఖండ విజయాలను అందించింది. అయితే, బీజేపీలో మోదీ స్థాయి నాయకత్వాన్ని అందించగల నేతలు లేరనే వాదన బలంగా వినిపిస్తోంది. అమిత్ షా, యోగి ఆదిత్యనాథ్, నితిన్ గడ్కరీ, రాజ్‌నాథ్ సింగ్ వంటి నాయకులు ఉన్నప్పటికీ, వారెవరూ మోదీ జాతీయ ఆకర్షణ లేదా ఓటర్లను ఏకతాటిపైకి తీసుకురాగల సామర్థ్యం కలిగి లేరని విశ్లేషకులు భావిస్తున్నారు. అమిత్ షా రాజకీయ వ్యూహకర్తగా బలమైన నాయకుడు, కానీ మోదీ స్థాయి జనాదరణ లేదు. యోగి ఆదిత్యనాథ్ ఉత్తరప్రదేశ్‌లో బలమైన నాయకుడు, కానీ జాతీయ స్థాయిలో ఆయన ప్రభావం పరిమితం. నితిన్ గడ్కరీ, రాజ్‌నాథ్ సింగ్ సీనియర్ నాయకులైనప్పటికీ, వారు జాతీయ నాయకత్వానికి అవసరమైన ఆకర్షణను ప్రదర్శించలేకపోతున్నారు.

మోదీ నాయకత్వం బీజేపీని ఒక వ్యక్తి కేంద్రీకృత పార్టీగా మార్చిందని విమర్శకులు ఆరోపిస్తున్నారు. బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే చెప్పినట్లు, "మోదీ లేకపోతే బీజేపీకి 150 సీట్లు కూడా రావు" అనే వ్యాఖ్య ఈ వాస్తవాన్ని స్పష్టం చేస్తుంది. బీజేపీ సంస్థాగత నిర్మాణం బలంగా ఉన్నప్పటికీ, మోదీ స్థాయి నాయకుడు లేకపోతే ఆ పార్టీ ఓటర్లను ఆకర్షించడంలో సవాళ్లను ఎదుర్కొనే అవకాశం ఉంది. విపక్షాల్లోనూ మోదీకి సమానమైన జాతీయ నాయకుడు కనిపించడం లేదు. కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీని ప్రధాని అభ్యర్థిగా ప్రాజెక్ట్ చేస్తున్నప్పటికీ, ఆయనకు కాంగ్రెస్ కూటమిలోనే పూర్తి మద్దతు లేదు. మమతా బెనర్జీ వంటి కీలక నాయకులు రాహుల్‌ను ప్రధాని అభ్యర్థిగా అంగీకరించడానికి విముఖత చూపిస్తున్నారు. రాహుల్ గాంధీ తనను తాను బలమైన నాయకుడిగా నిరూపించుకోవడంలో విఫలమవుతున్నారని విమర్శలు ఉన్నాయి. ఆయన ఆలోచనా విధానం, కుల?మత రాజకీయాలపై దృష్టి సారించడం వంటివి బీజేపీ వ్యూహాలకు ఎదురు నిలవలేకపోతున్నాయి. మోదీ కంటే మెరుగైన పాలన అందిస్తానని నిరూపించడంలో రాహుల్ వెనుకబడి ఉన్నారు. ఇక విపక్షాల్లో ఇతర నాయకుల విషయానికి వస్తే అరవింద్ కేజ్రీవాల్, మమతా బెనర్జీ లేదా ఇతర ప్రాంతీయ నాయకులు, జాతీయ స్థాయిలో మోదీకి సవాలు విసిరే స్థాయి ఆకర్షణ లేదా సంస్థాగత మద్దతు కలిగి లేరు. ఈ నేపథ్యంలో, మోదీ రిటైర్మెంట్ తీసుకున్నా, విపక్షాల నుంచి బలమైన ప్రత్యామ్నాయ నాయకత్వం లేకపోవడం దేశ రాజకీయాల్లో నాయకత్వ సంక్షోభాన్ని సూచిస్తోంది. బీజేపీలో 75 ఏళ్ల తర్వాత రిటైర్మెంట్ అనే అప్రకటిత నియమం గతంలో అద్వానీ, ఉమా భారతి, వెంకయ్య నాయుడి వంటి నాయకులపై వర్తింపజేయబడింది. అయితే, ఈ నియమం బీజేపీ రాజ్యాంగంలో లేదు. మోదీ రిటైర్మెంట్‌పై బీజేపీలో ఎటువంటి చర్చ జరగడం లేదు. ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ చేసిన "75 ఏళ్లు దాటితే సేవలు చాలు" అనే వ్యాఖ్య విపక్షాల్లో చర్చను రేకెత్తించినప్పటికీ, బీజేపీ నుంచి ఎటువంటి స్పందన రాలేదు.

రాజకీయ విశ్లేషకులు మోహిసినా కిద్వాయ్ చెప్పినట్లు, మోదీ స్వయంగా తప్పుకోకపోతే బీజేపీలో నాయకత్వ మార్పు చర్చకు రాదు. అంతర్జాతీయంగా జరుగుతున్న పరిణామాలు, రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో బలమైన నాయకత్వం అవసరమని ప్రజలు భావిస్తున్నారు. ఈ కారణంగా, మోదీ రిటైర్మెంట్ కోరుకునేవారు చాలా తక్కువ. ఎన్డీఏ మిత్రపక్షాలు, ముఖ్యంగా టీడీపీ, మోదీని సరైన సమయంలో ఉన్న సరైన నాయకుడిగా అభివర్ణిస్తున్నాయి.

కౌటిల్యుడు చెప్పినట్లు, ఒక సంస్థ బలంగా ఉండాలంటే, ఒక నాయకుడి అనుపస్థితిలోనూ అది సమర్థవంతంగా నడవాలి. మోదీ ఈ విషయంలో విఫలమయ్యారని విమర్శలు ఉన్నాయి. ఆయన తన స్థాయి నాయకత్వాన్ని అందించగల వారసుడిని సిద్ధం చేయలేకపోయారని ఆరోపణలు ఉన్నాయి. బీజేపీలో ఇతర నాయకులు ఎదగకుండా చేయడం లేదా ఆ స్థాయి నాయకత్వాన్ని ప్రోత్సహించకపోవడం వల్ల మోదీ తర్వాత శూన్యత తలెత్తే అవకాశం ఉంది. ఇదే సమస్య విపక్షాల్లోనూ కనిపిస్తోంది, ఎందుకంటే వారు కూడా మోదీకి సమానమైన నాయకుడిని అందించలేకపోతున్నారు. 2029 లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, నాయకత్వం ఒక కీలక అంశంగా మారే అవకాశం ఉంది. మోదీ తన రిటైర్మెంట్‌ను ప్రకటించకపోయినా, బీజేపీ తన స్థాయి నాయకత్వాన్ని సిద్ధం చేయడంలో విఫలమైతే, దాని రాజకీయ ఆధిపత్యం ప్రమాదంలో పడవచ్చు. అదే సమయంలో, విపక్షాలు కూడా బలమైన ప్రత్యామ్నాయ నాయకత్వాన్ని అందించడంలో విఫలమైతే, దేశ రాజకీయాల్లో నాయకత్వ సంక్షోభం తీవ్రమవుతుంది.

# లిక్కర్ స్కాం 2వ చార్జిషీటులో జగన్...?

**విజయవాడ – సూర్య వాస్తవం**

ఏపీలో మద్యం కుంభకోణం సృష్టిస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో భారీ మద్యం కుంభకోణం జరిగిందని స్పష్టమౌతోంది. ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణలో నమ్మలేని నిజాలు బయట పడుతున్నాయి. దాదాపు 40 మంది వరకు ఈ కేసులో నిందితులు. ఇప్పటివరకు 12 మంది అరెస్టు అయ్యారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందం తన రెండు ఛార్జ షీట్ ను సోమవారం విజయవాడలోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో దాఖలు చేసింది. 200 పేజీలతో కూడిన ఈ ఛార్జ షీట్లో ముగ్గురిపై కీలక ఆరోపణలు చేసింది. ప్రధానంగా ఐఏఎస్ అధికారి ధనుంజయ రెడ్డి, ఓ ఎస్ డి కృష్ణమోహన్ రెడ్డి, భారతి సిమెంట్స్ డైరెక్టర్ బాలాజీ గోవిందప్ప ఈ స్కాంలో కీలక పాత్ర పోషించినట్లు వెల్లడించింది. అయితే పలుమార్లు మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి పేరు ప్రస్తావించడం విశేషం.2019లో వైయస్సార్ కాంగ్రెస్అధికారంలోకి వచ్చింది. మద్యం పాలసీని మార్చింది. అప్పటివరకు ప్రైవేటు వ్యాపారులు మద్యం నిర్వహిస్తుండగా.. ప్రభుత్వమే నేరుగా మద్యం దుకాణాలను నడిపింది. రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండే ఏపీ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా మద్యం విక్రయాలను నియంత్రించింది. అప్పుడే అవినీతికి బీజం పడినట్లు తెలుస్తోంది. ఒక వ్యవస్థాగత సిండికేట్ ఏర్పాటు జరిగిందని.. సిట్ తన ఛార్జ షీట్ లో స్పష్టం చేసింది. ఇప్పటికే ప్రాథమిక ఛార్జ షీట్ నమోదు చేసిన సిట్.. తాజాగా ఏసీబీ కోర్టులో రెండో ఛార్జ షీట్ దాఖలు చేసింది. అయితే ఇందులో అనేక కీలక అంశాలను బయటపెట్టింది. ధనుంజయ రెడ్డి, కృష్ణ మోహన్ రెడ్డి, బాలాజీ గోవిందప్పల పాత్రను స్పష్టం చేసింది. ప్రతి దశలో అనైతికంగా అప్పటి ముఖ్యమంత్రి కార్యాలయ అధికారి ధనుంజయ రెడ్డి జోక్యం చేసుకున్నారని చూపించగలిగింది.అయితే పక్కా ఆధారాలను సేకరించింది ప్రత్యేక దర్యాప్తు బృందం కాల్ డేటా రికార్డులు, గూగుల్ టేక్ అవుట్ ఫైల్స్, ల్యాప్టాప్ డేటా ఆధారంగా వీరి సంప్రదింపులు, అక్రమ లావాదేవీలను సిట్ గుర్తించింది. ఒక్కో లిక్కర్ కేసుకు 150 నుంచి 200 రూపాయల వరకు ముడుపుగా వసూలు చేసినట్లు.. నెలకు సుమారుగా 50 నుంచి 60 కోట్ల వరకు సేకరించినట్లు సిట్ పేర్కొంది. ఈ నగదు హవాలా లావాదేవీల ద్వారా దుబాయ్, ఢిల్లీ, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు తరలించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే మొత్తం వ్యవహారాలను వివరించే క్రమంలో.. ఛార్జ షీట్లో జగన్ పేరును పలుమార్లు ప్రస్తావించింది సిట్.మద్యం కుంభకోణంలో సూత్రధారి జగన్ అని స్పష్టం చేసింది ప్రత్యేక దర్యాప్తు బృందం. అనేక నిర్ణయాల్లో నాటి సీఎం జగన్ పాత్ర ఉందని తేల్చింది. మద్యం అమ్మకాల విధానాల్లో మార్పు ఆయన పనేనని స్పష్టం చేసింది. ఒక వ్యవస్థీకృతమైన విధానం ద్వారా మద్యం కుంభకోణానికి పాల్పడినట్లు స్పష్టం చేసింది ప్రత్యేక దర్యాప్తు బృందం. నేరుగా సీఎం సన్నిహితులకు మద్యం ముడుపులు అందాయని? ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన ధనుంజయ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, గోవిందప్ప బాలాజీ భారీగా ఆస్తులు సమకూర్చుకున్నట్లు తెలుస్తోంది. అయితే మనీ లాండరింగ్ ద్వారా దుబాయ్ కంపెనీలకు ముడుపుల సొమ్ము చేర్చింది ఈశ్వర్ కిరణ్ కుమార్ రెడ్డి అని స్పష్టం అయింది. అయితే ఈ మొత్తం నిందితుల మధ్య ఫోన్ సంభాషణలకు సంబంధించిన సమాచారం కూడా సిట్ సేకరించింది. ఫోన్ల లొకేషన్ లతో కీలక సమాచారాన్ని రాబెట్టింది. ఫోరెనిక్స్ విశ్లేషణలతో నిర్ధారణ చేసుకుంది. మద్యం సరఫరా ఆర్డర్లు మార్చేసి? ఆధారాలను సైతం ధ్వంసం చేసినట్లు ప్రత్యేక దర్యాప్తు బృందం గుర్తించింది. అయితే అంతిమ లబ్ధిదారుడు జగన్ అని పరోక్షంగా సంకేతాలు ఇచ్చింది సిట్. తద్వారా మూడో ఛార్జ షీట్లో నేరుగా అప్పటి సీఎం జగన్ ప్రమేయాన్ని మరింత నిర్ధారించి? స్పష్టతనివ్వనున్నట్లు అర్థమవుతోంది.



**కొత్త డెన్‌లు**

వైసిపి హయాంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ భారీగా అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలు ఉన్నాయి. దాదాపు 18 వేల కోట్ల రూపాయలు ప్రభుత్వ ఆదాయానికి గండిపడగా.. 3500 కోట్ల రూపాయల కుంభకోణానికి పాల్పడ్డారు అన్నది ప్రధాన ఆరోపణ. దీనిపై దర్యాప్తు చేపట్టిన ప్రత్యేక దర్యాప్తు బృందం సంచలన విషయాలను బయటపెడుతోంది. దాదాపు ఈ స్కాంలో 40 మంది నిందితులు ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే 12 మంది నిందితులు అరెస్ట్ అయ్యారు. ఇటీవలే రాజంపేట ఎంపీ మిధున్ రెడ్డి అరెస్టు అయ్యారు. ముందుగా సూత్రధారి రాజ్ కసిరెడ్డి అరెస్టు కాగా.. తరువాత వరుస అరెస్టులు కొనసాగుతున్నాయి. అప్పటి సీఎంఓ కీలక అధికారి ధనుంజయ రెడ్డి, జగన్ ఓ ఎస్ డి కృష్ణమోహన్ రెడ్డి, బాలాజీ గోవిందప్ప వంటి వారు అరెస్టయ్యారు. అయితే వీరి ప్రమేయం విషయంలో ఎటువంటి సమాచారం బయటకు రాకున్నా.. ఏ 34 నిందితుడిగా ఉన్న వెంకటేష్ నాయుడు కు సంబంధించిన వీడియోలు వరుసగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వాటిని పరిశీలిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం మరింత లోతైన విచారణ కొనసాగిస్తోంది.చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి అత్యంత సన్నిహితుడే ఈ వెంకటేష్ నాయుడు. మద్యం కుంభకోణంలో ఈయన పాత్ర కీలకం అన్నట్టు తెలుస్తోంది. ముఖ్యంగా రాజ్ కసిరెడ్డి సూత్రధారి అయితే.. మద్యం కుంభకోణం ద్వారా కొల్లగొట్టిన సొమ్మును భద్రపరచడం, అప్పటి ప్రభుత్వ పెద్దలకు చేర్చడం వెంకటేష్ నాయుడు ప్రధాన విధిగా తెలుస్తోంది. అయితే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అరెస్టు సమయంలో తమకు ఏ పాపం తెలియదని.. ప్రభుత్వమే కక్ష సాధింపునకు దిగుతోందని సంచలన ఆరోపణలు చేశారు. అయితే ఆయనకు సన్నిహితుడిగా భావిస్తున్న వెంకటేష్ నాయుడు తాజా వీడియోలు, ఫోటోలు సోషల్ మీడియాలో దర్శనం ఇస్తున్నాయి. భారీ డెన్ లు, నోట్ల కట్టలకు సంబంధించిన ఈ వీడియోలు హల్చల్ చేస్తున్నాయి. అంతటితో ఆగకుండా వెంకటేష్ నాయుడు విలాసవంతమైన జీవితానికి సంబంధించిన దృశ్యాలు కూడా కనిపిస్తున్నాయి. దీంతో సిట్ దర్యాప్తు మరింత లోతుగా కొనసాగే అవకాశం కనిపిస్తోంది.వెంకటేష్ నాయుడు కు సంబంధించిన వీడియో ఒకటి తొలుత వెలుగులోకి వచ్చింది. ఒక డెన్ లో భారీ నోట్ల కట్టలు లెక్కిస్తూ ఆయన కనిపించారు. అయితే తాజాగా ఆయన ప్రత్యేక విమానాల్లో విలాసవంతమైన ప్రయాణాలకు సంబంధించిన వీడియోలు కూడా బయటకు వచ్చాయి. ప్రత్యేక విమానాల్లో మద్యం కుంభకోణానికి సంబంధించి సొమ్మును తరలిస్తున్నట్లు కూడా కామెంట్స్ వినిపించాయి. మరోవైపు సినీనటి తమన్నా ప్రత్యేక సెల్ఫీ.. స్పెషల్ ఫ్లైట్లో కనిపిస్తోంది. దీంతో యాపారం చాలా ఉంది అంటూ కామెంట్స్ సోషల్ మీడియాలో వినిపిస్తున్నాయి. మరోవైపు బీఆర్ఎస్ నేత కవితతో సైతం వెంకటేష్ నాయుడు దిగిన ఫోటోలు సోషల్ మీడియాలో సర్కులేట్ అవుతున్నాయి. అయితే మద్యం కుంభకోణం ద్వారా కొల్లగొట్టిన సొమ్మును సేఫ్ జోన్ లో తీసుకెళ్లే బాధ్యత వెంకటేష్ నాయుడు దేనని ప్రచారం జరుగుతోంది. ప్రత్యేక దర్యాప్తు బృందం కూడా వెంకటేష్ నాయుడు చుట్టూ విచారణ చేపడుతున్నట్లు తెలుస్తోంది.

# అగ్రదేశాల్లో భారత్ భయం



**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం**

భారత్.. ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఒకటి. జీడీపీ పరంగా ఇండియా ప్రస్తుతం ఐదో స్థానానికి చేరింది. పదేళ్లలో ఐదు స్థానాలు ఎగబాకింది. ఇటీవలే జపాన్‌ను కూడా వెనక్కు నెట్టి నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించింది.

4.19 ట్రిలియన్ డాలర్ల నామినల్ జీడీపీతో ఈ స్థానం సంపాదించింది. అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) అంచనాల ప్రకారం, 2028 నాటికి భారతదేశం జర్మనీని అధిగమించి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలవనుంది. ఈ ఎదుగుదలే ప్రపంచ దేశాలకు కటగింపుగా మారింది. భారత్ ఎదుగుదలను ఓర్వలేక పోతున్నాయి. అమెరికాకు అయితే మన ఎదుగుదల అస్సలు మింగుడు పడడం లేదు. ఒకరకంగా చెప్పాలంటే అమెరికాలో భారత్‌అంటే వణుకు మొదలైంది. ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల జాబితాలో యునైటెడ్ స్టేట్స్ 30.51 ట్రిలియన్ డాలర్ల జీడీపీతో మొదటి స్థానంలో ఉంది, ఆ తర్వాత చైనా 19.23 ట్రిలియన్ డాలర్లతో రెండో స్థానంలో నిలిచింది. జర్మనీ (4.74 ట్రిలియన్ డాలర్లు), భారతదేశం (4.19 ట్రిలియన్ డాలర్లు), జపాన్ (4.19 ట్రిలియన్ డాలర్లు) తదుపరి స్థానాల్లో ఉన్నాయి. యూకే 3.84 ట్రిలియన్ డాలర్లు, ఫ్రాన్స్ 3.21 ట్రిలియన్ డాలర్లు, ఇటలీ 2.42 ట్రిలియన్ డాలర్లు, కెనడా 2.23 ట్రిలియన్ డాలర్లు, బ్రెజిల్ 2.13 ట్రిలియన్ డాలర్లతో తర్వాతి ఐదు స్థానాల్లో ఉన్నాయి. ఈ ర్యాంకింగ్‌లు దేశాల ఆర్థిక బలాన్ని, వృద్ధి సామర్థ్యాన్ని సూచిస్తాయి.

2025లో భారతదేశం 4 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా జపాన్‌తో సమానంగా నాల్గవ స్థానంలో నిలిచింది. వ్యవసాయం, టెక్నాలజీ సేవలు, చేనేత పరిశ్రమ, వ్యాపార ఔట్‌సోర్సింగ్ వంటి రంగాలు భారతదేశ ఆర్థిక ప్రగతికి దోహదపడ్డాయి. ఐఎంఎఫ్ అంచనాల ప్రకారం, 2024?25, 2025?26లో భారతదేశ జీడీపీ వృద్ధి రేటు 6.2%గా ఉంటుంది, ఇది ప్రపంచంలోని ప్రముఖ ఆర్థిక వ్యవస్థలలో అత్యంత వేగవంతమైంది.ఇదిలా ఉంటే.. భారతదేశం నాల్గవ స్థానంలో ఉన్నప్పటికీ, తలసరి ఆదాయం 2,880 డాలర్లు (సుమారు రూ. 2.4 లక్షలు)గా ఉంది, ఇది జపాన్ (33,960 డాలర్లు)తో పోలిస్తే గణనీయంగా తక్కువ. అయితే, గత దశాబ్దంలో తలసరి ఆదాయం 188% పెరిగింది, 2015లో రూ. 86,647 నుంచి 2025లో రూ. 2.4 లక్షలకు చేరుకుంది. జనాభా వృద్ధి, ఉపాధి డిమాండ్, ఆర్థిక సంస్కరణలు ఈ పెరుగుదలకు దోహదపడ్డాయి.గత 10 సంవత్సరాలలో భారతదేశ జీడీపీ వృద్ధి రేటు హెచ్చుతగ్గులను చవిచూసింది. 2020లో కోవిడ్ మహమ్మారి సమయంలో ?6.6% వృద్ధి రేటు నమోదైనప్పటికీ, 2021లో 8.68%కి గణనీయంగా పుంజుకుంది. 2023, 2024లో 8.2% వృద్ధి రేటుతో భారతదేశం ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థలలో వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా నిలిచింది.

- 2013: 6.39%, - 2014: 7.41%
- 2015: 8.00%, - 2016: 8.26%
- 2017: 6.80%, - 2018: 6.45%
- 2019: 3.74%, - 2020: ?6.60%
- 2021: 8.68%, - 2022: 7.00%
- 2023: 8.20%, - 2024: 8.20%

**వృద్ధి రేటు నమోదైంది.**

భారతదేశం 2027 నాటికి ?5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారే సామర్థ్యాన్ని కలిగి ఉంది. 2028 నాటికి జర్మనీని అధిగమించి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలవనుంది. ప్రభుత్వ సంస్కరణలు, శ్రామిక, వ్యాపార సౌలభ్యం, పెరుగుతున్న వినియోగం, పెట్టుబడులు ఈ లక్ష్యాన్ని సాధించడంలో కీలక పాత్ర పోషిస్తాయి.భారత దేశ అభివృద్ధి వేగం.. ఇప్పుడు ప్రపంచంలోని సంపన్న దేశాలకు మింగుడు పడడం లేదు. అందుకే మనను తొక్కేయాలని చూస్తున్నాయ. రష్యా ఒక్కటే మనకు మద్దతుగా నిలుస్తోంది. ఇక అమెరికాకు నంబర్ స్థానానికి ముప్పు వస్తుందనే భయం నెలకొంది. అందుకే డొనాల్డ్ ట్రంప్ ఇప్పుడు భారత్‌ను చూసి జంకుతున్నారు. ఈ క్రమంలోనే మన ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసేలా టారిఫ్‌లు విధిస్తున్నారు.

# పంద్రాగస్టు వేడుకలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలి

## - ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ శివ్ నారాయన్ శర్మ




**అనంతపురం కలెక్టరేట్ -సూర్య వాస్తవం, ఆగస్టు 13:** జిల్లా కేంద్రంలోని పోలీస్ పెరేడ్ మైదానంలో ఈనెల 15న జరిగే 79వ భారతస్వాతంత్ర దినోత్సవ వేడుకలను ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ శివ్ నారాయన్ శర్మ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం ఏఆర్ఏఎస్పి ఇలియాజ్ బాషా,అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ సహార్ తో కలిసి అనంతపురం పోలీస్ పెరేడ్ మైదానంలోజరిగేకార్యక్రమాల నిర్వహణకు సంబంధించి పనులను పరిశీలించారు. తొలుత పోలీసు కవాతు తదితర రిహార్సల్స్ లో పాల్గొన్నారు. అలాగే మైదానంలో ఇప్పటివరకు జరుగుతున్న పనుల గురించి అధికారుల ద్వారా ఆరా తీశారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశం మేరకు శుక్రవారం ఉదయం 9 - 02 గంటలకు మన జిల్లా వాసి అయిన రాష్ట్ర ఆర్థిక ,ప్రణాళిక, వాణిజ్య పన్నులు శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రివర్యులు గౌరవ మాన్యశ్రీ పయ్యావుల కేశవ్ పాల్గొని జాతీయ పతాకావిష్కరణ గావిస్తారని తెలిపారు. ప్రజలందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఇన్చార్జ్ కలెక్టర్ కోరారు. ఈ నేపథ్యంలో వేడుకలకు సంబంధించి పకడ్బందీగా అవసరమైన అన్ని ఏర్పాట్లను పక్కాగా రేపటిలోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా దేశభక్తి ఉట్టిపడే విధంగా కార్యక్రమాల నిర్వహణ చేపట్టాలని ఆదేశించారు. అలాగే పోలీస్ పెరేడ్ గ్రౌండ్ నందువేదిక అలంకరణ, పోలీస్, ఎన్.సి.సి. హెూంగార్డుల పెరేడ్ నిర్వహణ, జాతీయ పతాకా విష్కరణ ఏర్పాటు చర్యలు, ప్రోటోకాల్, పోలీసు బందోబస్తు అంశాలపై జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ఆహ్వాన పత్రికల పంపిణీ, నిరంతర విద్యుత్ సరఫరా, సీటింగ్ ఏర్పాట్లు, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్య పనులు, ట్రాఫిక్ మళ్లింపులు, పార్కింగ్ స్థలం ఏర్పాటు, బారి కేడింగ్, మొబైల్ టాయిలెట్ల ఏర్పాట్లు, వైద్య ప్రథమ చికిత్స శిబిరం ఏర్పాటు, పి.టి.సి. బ్యాండ్ ఏర్పాటు ,విశిష్ట సేవలు అందించిన వారికి ప్రశంస పత్రాల ప్రదానం తదితర అంశాలపై ఆయా శాఖల అధికారులు ప్రత్యేక దృష్టిని సారించి ఎలాంటి లోటుపాట్లు లేకుండా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ల

అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ప్రజలకు తెలియజేసే విధంగా వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా శాఖకటాల ప్రదర్శన మరియు స్టాల్స్ ను ఏర్పాటు చేయాలని, వివిధ పాఠశాలల విద్యార్థుల ద్వారా దేశభక్తిని పెంపొందించే విధంగా జాతీయసమైక్యత పై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని ఇంచార్జ్ కలెక్టర్ ఆయా శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమం ప్రారంభం నుండి జాతీయ గేయం ముగింపు వరకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రణాళిక బద్ధంగా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుని రెవెన్యూ పోలీసు తదితర శాఖల అధికారులు సమన్వయం చేసుకొని ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, ఆర్డీఓ కేశవ నాయుడు, డిప్యూటీ కలెక్టర్లు మల్లికార్జునుడు, రామ్మోహన్, మల్లికార్జున, డిఐపిఆర్ఓ బాల కొండయ్య, హౌసింగ్ పిడిశైలజ,డీఎస్ఓవెంకటేశ్వర్లు, విద్యుత్ శాఖ ఈ ఈ రమేష్ డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, మెప్మా పీడీ విశ్వ జ్యోతి, జిల్లా వ్యవసాయఅధికారిఉమామహేశ్వరమ్మ, ఆర్.అండ్.బి ఎస్ఈ రాజగోపాల్,ఏపీఎంఐపీ పిడీ రఘునాథ్ రెడ్డి, తహసీల్దార్లు హరికుమార్, మోహన్ రావు, మహబూబ్ భాష, ఆర్ట్స్ కళాశాల ఎన్సిసి, డా. అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థిని విద్యార్థులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 17న ఉచిత కంటి చికిత్స శిబిరం



**పామిడి- సూర్య వాస్తవం, ఆగస్టు 13:** పామిడి పట్టణంలోని భావసార క్షత్రియ కళ్యాణమంటపంలో ఈ నెల 17వ తేదీన ఆదివారం స్థానిక లైన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు ఆధ్వర్యంలో ఉచిత కంటి చికిత్స మెగా శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రఖ్యాతి చెందిన అత్యాధునిక నిపుణులు కలిగిన బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి వారు పరిశీలించగలరని తెలిపారు. కంటి జబ్బు కలిగిన వారందరూ శిబిరంలో పాల్గొని కళ్ళను పరిశీలించుకోవాలని ఆయన కోరారు. నిపుణుల పరిశీలనలో ఆపరేషనుకు ఎంపికైన వారిని అదే రోజున ఉచితముగా ఆసుపత్రికి చెందిన బస్సులో తీసుకొనిపోయి ఆపరేషన్ తదనంతరం తిరిగి పామిడికి చేర్చగలరని ఆయన పేర్కొన్నారు. శిబిరంలో పాల్గొన్నవారు ఆధార్ కార్డు రెండు పాస్ ఫోటోలు తీసుకొని రావాలని, తల స్థానం చేసి, శుభ్రమైన దుస్తులు ధరించి మాస్క్ వేసుకొని వచ్చి పాల్గొనాలని తెలిపారు. భోజన వసతి సౌకర్యంలో ఆసుపత్రి వారే సమకూర్చుదనని తెలిపారు.

# నూలువీడు గ్రామాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి




**అన్నమయ్య బ్యూరో - సూర్యవాస్తవం, ఆగస్టు 13:** పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అందిన భూమి సమస్యపై గాలివీడు మండలం నూడివీడు గ్రామాన్ని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి బుధవారం మధ్యాహ్నం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గాలివీడు మండల తాసిల్దార్ కు భూమి సమస్యపై తగు సూచనలు చేశారు. ఈ తనిఖీలు గాలివీడు మండల తాసిల్దార్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాలలో

# కమ్యూనికేషన్, సాఫ్ట్ స్కిల్స్‌పై అవగాహన





**అన్నమయ్య బ్యూరో - సూర్యవాస్తవం, ఆగస్టు 13:** అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి శ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం నాడు ఇంజనీరింగ్ విద్యార్థినీ విద్యార్థుల కోసం కమ్యూనికేషన్, సాఫ్ట్ స్కిల్స్ అంశాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ కార్పొరేట్ ట్రైనర్ జావిద్‌ఖాన్ ప్రధాన రిసోర్స్ పర్సన్‌గా హాజ రయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులతో జావిద్‌ఖాన్ మాట్లాడుతూ... ప్రస్తుత పోటీ ప్రధానమైన ప్రపంచంలో ప్రతి విద్యార్థి తన జీవిత లక్ష్యం స్పష్టంగా నిర్ణయిం చుకోవాలని సూచించారు. ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి అంకితభావం, కృషి, పట్టుదల, ధనాత్మక ఆలోచన, అలాగే ఒత్తిడిని జయించే నైపుణ్యం అవసరమని పేర్కొన్నారు. మంచి నడ వడికతో, సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ముందడుగు వేస్తే ఎవరైనా తమ కలలను సాకారం చేసు కోవచ్చని తెలిపారు. టైమ్ మేనేజ్మెంట్, కమ్యూనికేషన్ స్కిల్స్ ఉద్యోగ అన్వేషణలో కీలక పాత్ర పోషిస్తాయని, భావవ్యక్తీకరణ నైపుణ్యం ద్వారా విషయాన్ని ఎదురుగా ఉన్న వారికి సంక్షిప్తంగా, స్పష్టంగా వివరించగలగడం విజ యానికి మార్గం చూపుతుందని చెప్పారు. ఆత్మన్యూనతా భావాన్ని తొలగించుకోవడం నిరంతర అభ్యాసం ద్వారా కమ్యూనికేషన్ స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోవడం అవసరమని సూచించారు. అదే విధంగా, ఇంటర్వ్యూ స్కిల్స్, తరచుగా అడిగే ప్రశ్నలు, వాటి సమర్థవంతమైన సమాధానాలపై విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీ సాయి విద్యా సంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ - కళాశాలలో ఇంజనీరింగ్ పాలిటెక్నిక్ విద్యార్థులకు మోటివేషన్, కమ్యూనికేషన్ స్కిల్, అంకగణిత రీజనింగ్ అంశాలపై ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామన్నారు. కళాశాల డిజిటల్ లైబ్రరీ సౌకర్యాన్ని పూర్తిగా ఉపయో గించుకొని ఉద్యోగ అవకాశాలను పెంపొందించుకోవాలని, ఉన్నత స్థానాలను అందుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో, అంకిత భావంతో చదువుకుని లక్ష్యాన్ని చేరుకోవాలని, కళాశాలలో నిర్వహించే ప్రతి అవగాహన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. బాలాజీ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వి. వెంకట రమణ, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం, ఆగస్టు 13:** రాయచోటిలో ఇర్ఫాన్ ఐ కేర్ కంటి ఆసుపత్రి ప్రారంభంలో మాజీ ఎమ్మెల్యే మోహన్ రెడ్డి రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని మాజీ ఎంఎల్ఏ మోహన్ రెడ్డి సూచించారు. బుధవారం ఉదయం రాయచోటి పట్టణంలోని గాలివీడు రహదారి మార్గంలో ఇర్ఫాన్ చే ఏర్పాటైన ఇర్ఫాన్ ఐ కేర్ కంటి ఆసుపత్రి ప్రారంభంలో ముఖ్య అతిథిగా మోహన్ రెడ్డి పాల్గొన్నారు. పట్టణంలో అధునాతన వసతి సౌకర్యాలుతో ఆసుపత్రులు ఏర్పాటవుచుండడం హర్షదాయ కమని మోహన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డా బయారెడ్డి, వైఎస్ఆర్ సిపి మైనారిటీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్, టెలికాం సభ్యుడు అబుజర్, బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి విజయ భాస్కర్, స్టేట్ యూత్ కార్యదర్శి సూరం వెంకట సుబ్బారెడ్డి, యూత్ కొత్తపల్లె ఇంతియాజ్, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు సగినాల శివ శంకర్, పవన్, అర్షాద్, సోహెబ్ తదితరులు పాల్గొన్నారు.



# పిల్లలకు ఆధునిక బోధనా పద్ధతులు తప్పనిసరి

## - వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రిన్సిపల్ సెక్రెటరీకి వివరించిన జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి



**అన్నమయ్య బ్యూరో- సూర్య వాస్తవం, ఆగస్టు 13:** అంగన్వాడీ సెంటర్లలో ఈసిసి కార్యక్రమాల ద్వారా పిల్లలకు ఆధునిక బోధనా పద్ధతులు అనుసరించడం అత్యవసరమని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి వివరించారు. బుధవారం అమరావతి సచివాలయం నుండి ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్యకుమారి అంగన్వాడీ సెంటర్లలో ఈసిసిసమర్థవంతమైన కార్యకలాపాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లా కలెక్టర్ తో పాటు స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ హైమావతి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలలో ఈసిసి కార్యకలాపాలు పిల్లల మానసిక, శారీరక, భాషా, సామాజిక అభివృద్ధికి అత్యవసరమని, పిల్లలకు ఆధునిక బోధనా పద్ధతులు అనుసరించేలా చర్యలు తీసుకోవాల్సి వుందని వివరించారు. సాంకేతిక సదుపాయాలతో కూడిన ఈసిసి కార్యకలాపాలను అడాప్ట్ చేసుకుంటే అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చన్నారు. పిల్లల భవిష్యత్తుకు ఇది బలమైన పునాది అవుతుందన్నారు. కాజ్డ్ ఫేజ్డ్ లెర్నింగ్ పద్ధతులు పిల్లల అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించడంలో కీలకమని పేర్కొన్నారు. మారుతున్న తరానికి అనుగుణంగా ఆధారిత కార్యకలాపాలను దత్తత తీసుకుంటే అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చని కలెక్టర్ వివరించారు.

జిల్లాలోని 11 ప్రాజెక్టుల పరిధిలోని 2,275 అంగన్వాడీ కేంద్రాల్లో 35,248 మంది పిల్లలకు పౌష్టికాహారం ప్రాథమిక విద్య అందిస్తున్నామని వివరించారు. పిల్లలకు సూక్ష్మంగా చెప్పాల్సిన పాఠ్యాంశాలను ఎల్ఈడి స్క్రీన్‌ల ద్వారా వీడియో రూపంలో, ప్లే బేస్డ్ పద్ధతిలో అందించడం ద్వారా సమానమైన, సమర్థవంతమైన బోధన సాధ్యమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఫిజికల్ లెర్నింగ్ కు పరిమితులు వుంటాయని ఆధునిక సాంకేతిక పద్ధతులు ఉపయోగిస్తే అన్ని కేంద్రాల అంగన్వాడీ టీచర్లు ఒకే స్థాయిలో బోధించగలరని అన్నారు. ఇటీవల తాను తంబళ్లపల్లెలో అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి మూవబుల్ గ్రీన్ బోర్డులు ఏర్పాటు చేయడం వల్ల మంచి ఫలితాలు వచ్చాయని తెలిపారు. అలాగే అంగన్వాడీ కార్యకర్తల వద్ద ఉన్న పాత మొబైల్ ఫోన్లను అప్‌గ్రేడ్ చేసి, వీడియో కంటెంట్, ప్లేబ్యాక్ సదుపాయం కల్పించాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రాథమిక శిక్షణతో పాటు పునఃశిక్షణా తరగతులు నిరంతరాయంగా కొనసాగిస్తే మరింత మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయని కలెక్టర్ వివరించారు. అలాగే తల్లిదండ్రులతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించి, పిల్లల అభ్యాసనకు అనుకూల వాతావరణం సృష్టించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు జాగ్రత్తలు వహించాలి

**- మున్సిపల్ కమిషనర్**



**గుత్తి - సూర్య వాస్తవం, ఆగస్టు 13:** గుత్తి మున్సిపాలిటీ పరిధిలో ప్ర స్తుతం కురుస్తున్న వర్షాభా వపరి స్థితులతో సీజనల్ వ్యాధుల ప్రబలకుండా ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ముందు జాగ్రత్తలు చేపట్టుటలో భాగంగా పట్టణంలో పందుల బెడద మరియు సంచరణను అరికట్టుటకు పందుల యజమానులతో సమావేశం ఏర్పాటు చేసిన మున్సిపల్ కమీషనర్ బి.జబ్బార్ మి యా వివరాలు వెల్లడిస్తూ పందుల యజమానులు తమకు సంబంధించిన పందులను పట్టణానికి 5కిలో మీటర్ల దూరంలో పెం పక సంరక్షణ చేసుకోవాలని వాటిని పట్టణ పరిధిలో సంచరించ కుండా చూసుకునే బాధ్యత పందుల యజమానులదేనని తెలి పారు. వార్డుల నుండి ప్రజల ద్వారా పందుల సంచరణ పై ఫిర్యాదులు వస్తున్నాయి. కావున తమ పందులను పట్టణం యందు సం చరించకుండా నివారించుకుని పట్టణ ప్రజల ఆరోగ్యం దృష్ట్యా వాటిని పట్టణానికి 5 కిలో మీటర్ల దూర ప్రాంతాలలో సంరక్షించుకో వాలనే మార్గదర్శకాలను ఖాతరు చేసిన యెడల తమపై మున్సిపల్ చట్టపరమైన చర్యలు తీసుకొనబడునని హెచ్చరించడమైందని పందుల యజమానులకు తెలిపిన మున్సిపల్ కమిషనర్ బి. జబ్బార్ మియా ఈ ప్రకటన ద్వా రా తెలియజేశారు.ఈ కార్యక్ర మంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా, శానిటేషన్ సెక్రెటరీలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## పెన్షనర్ల భవనంలో ఎన్నికల నామినేషన్



**గుత్తి -సూర్య వాస్తవం, ఆగస్టు 13:** గుత్తి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల కార్యవర్గ సభ్యుల పదవీ కాలం 3సం,,లు పూర్తి అవుతు న్నందున జిల్లా నాయకుల ఆదే శాల మేరకు.ప్రభాకర్,జిల్లా ఎన్ని కల అధికారిగా నిర్వహించారు. ఎన్నికల అధికారి డి.ప్ర భాకర్ మొత్తం 14 మంది నామినేషన్లు స్వీకరించారు.ఎన్నికల పరిశీలకు లుగా అనంతయ్య,సూర్య నారా యణను నియమించారు. ఎన్నికల అధికారి డి.ప్రభాకర్ మాట్లాడు తూ ఇంతవరకు చెల్లించని పి.ఆ ర్.సి బకాయిలను వెంటనే చెల్లిం చాలని డిమాండ్ చేశారు. వయస్సు రిత్యా ఇస్తున్న అడిషనల్ క్వాన్ టంను తగ్గించిందని, వాటిని పునరుద్ధరించాలని తెలిపారు. పెన్షనర్లు మరణించిన రోజే అంత్యక్రియలు కుఇచ్చే మొత్తాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధి కారి డి.ప్రభాకర్,ఎన్నికల పరిశీల కులు సూర్య నారాయణ, అనంతయ్య, ప్రెసిడెంట్ అబూబాకర్ సెక్రెటరీ రామ్ మోహన్, అదనపు కార్య దర్శి జెన్నే కుల్లాయిబాబు స్వర్ణాంబ, ఫక్రుద్దీన్, షైక్షావలి, వెంకటేష్, దేవదాస్, హస్సన్ హహమ్మద్, మొదలగు వారు పాల్గొన్నారు.

## పలు వివాహా వేడుకల్లో పాల్గొన్న ఏపీ సీడ్స్ ఛైర్మన్





**డోన్ -సూర్య వాస్తవం, ఆగస్టు 13:** డోన్ మండలం, దొరపల్లె గ్రామంలో మాజీ ఎంపిటిసి వేంకటేశ్వర్లు పిలుపుమేరకు లోకేష్ వివాహమునకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి కోసనపల్లె రామాంజనేయులు ఆహ్వానం మేరకు డోన్ పట్టణంలో దత్తసాయి ఫంక్షన్ హాల్‌లో వరుడు:రాజు, వధువు:ప్రీతి గార్ల వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి.

# 'మత్తు'కు బానిసలు కావద్దు!

- మత్తు పదార్థాలతో జీవితాలు అంధకారం
- జిల్లా ఎస్పీ ఆదేశాలతో "నషా ముక్త్ భారత్ అభియాన్" కార్యక్రమాలు



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, ఆగస్టు 13:** జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పలు కళాశాలలు, పాఠశాలలో "నషా ముక్త్ భారత్ అభియాన్" కార్యక్రమాలు ఆయా పోలీసులు నిర్వహించారు. అంతేకాకుండా...ముఖ్యమైన ప్రదేశాలు, హాట్ స్పాట్‌ల వద్ద మారథాన్, వాక్‌తాన్‌లు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా పోలీసు అధికారులు మాట్లాడుతూ... కొందరు మత్తుకు అలవాటు పడి భవిష్యత్తును విచ్ఛిన్నం చేసుకుంటున్నారని, సమాజంలోని ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలను విక్రయించే లేదా వినియోగించు వారి వివరాలను పోలీసు శాఖకు అందించి అలాంటి వారిలో మార్పు తీసుకొచ్చేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర డీజీపీ హరీష్ గుప్తా ఉత్తర్వులు...జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు "నషా ముక్త్ భారత్ అభియాన్"లో భాగంగా జిల్లాలోని ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో బుధవారం యాంటి డ్రగ్స్ అవగాహన కార్యక్రమాలు నిర్వ హించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సమాజంలో యువత మత్తుకు అలవాటు పడి బంగారు భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారని, పలువురు మత్తు పదార్థాలకు అలవాటు పడి, డబ్బుల కోసం నేరాలు హత్యలకు సైతం పాల్పడుతూ, మంచి భవిష్యత్తును కోల్పోతుండటం ఆందోళన కల్గించే విషయమన్నారు. తల్లిదండ్రులు ఎంతో బాధ్యతగా తమ పిల్లలు ఉన్నతమైన స్థాయిలో ఉంటారని కలలుగన్న వారి కలలను కల్లలుగా చేస్తున్నారని... మత్తు పదార్థాలు సేవించడం వల్ల మైండ్ తో పాటు, విచక్షణా శక్తిని కోల్పోతున్నారని...మానసిక, శారీరక, అనా రోగ్యాలు, ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతూ సమాజం నుండి దూరమవుతున్నారన్నారు.

పోలీసు యంత్రాంగం గంజాయి, ఇతర నిషేదిత మత్తు పదార్థాలు ఏ మూల విక్రయించినా దాడులు నిర్వహిస్తు, రూపుమాపేందుకు కఠిన చర్యలు చేపడుతున్నారని, గంజాయి ఎక్కడెక్కడ ఉందో వాటి మూలాలకు వెళ్లి చర్యలు తీసు కుంటున్నారని తెలిపారు. ప్రాణాంతకమైన మత్తు పదార్థాలకు, మాదక ద్రవ్యాలకు 'నో' చెప్పేలా పోలీస్ శాఖకు సహకరించి యువత బంగారు భవిష్యత్తు కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మాదకద్రవ్యాల సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండి ఏ ఒక్కరూ డ్రగ్స్ బారిన పడకుండా ఉండేందుకు తమ వంతు కృషి చేస్తామని, డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు చేసే వ్యక్తుల సమాచారాన్ని పోలీసు శాఖకు తెలియచేస్తానని ఉన్నత పాఠశాలలు/ కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేశారు. మీ చుట్టుపక్కల ప్రాంతాలలో ఎవరైనా మత్తు పదార్థాలకు అల వాటు పడ్డట్లు గుర్తించినా లేదా గంజాయి విక్రయిసు _న్నారన్న సమాచారం తెలిస్తే ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 ద్వారా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.





# సీపీఐ అంటే క్యాష్ పెయిడ్ ఇమ్మీడియట్లీ పార్టీగా మారిపోయింది

- 23 వేల మెజార్టీతో గెలిచిన ఎమ్మెల్యేపై విమర్శలు చేస్తారా
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ వ్యాఖ్యలపై టిడిపి నాయకుల ఆగ్రహం
- మహాసభలకు చందాలు ఇవ్వలేదని ఎమ్మెల్యే దగ్గుపాటిపై ఆరోపణలు చేస్తారా..?
- త్వరలోనే సీపీఐ భూ ఆక్రమణలు, సెటిల్మెంట్ల బండారాన్ని బయటపెడుతాం



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, ఆగస్టు 13:** సీపీఐ అంటే భారత కమ్యూనిస్టు పార్టీ అనే అర్థం మారిపోయిందని... ఇప్పుడు ఆ పార్టీని క్యాష్ పెయిడ్ ఇమ్మీడియట్లీగా చూస్తున్నారని అనంతపురం అర్బన్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు విమర్శలు చేశారు. అనంతపురం అర్బన్ టిడిపి కార్యాలయంలో పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్లు పోతుల నరసింహులు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి బుగ్గయ్య చౌదరి, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ, తెలుగుయువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్, టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఫిరోజ్ అహ్మద్, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ పి ఎల్ ఎన్ మూర్తి, రజక కార్పొరేషన్ డైరెక్టర్ పరమేశ్వర్, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కడియాల కొండన్న, బెస్త సాధికార సమితి రాష్ట్ర నాయకుడు చేపల హరి, కురువ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి కాశీ విశ్వనాథ్, టిడిపి నేత కరీం లు మీడియాతో మాట్లాడుతూ గత రెండు రోజులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ చేస్తున్న వ్యాఖ్యల మీద తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కమ్యూనిస్టు పార్టీ అంటే ఒక విలువలతో కూడిన పార్టీగా ఉండేదని. కానీ ఇప్పుడు కొందరు నాయకులు ఆ అర్థాన్ని మార్చేస్తున్నారన్నారు. అనంతపురం అర్బన్ నియోజక వర్గంలో గతంలో ఎప్పుడూ లేనివిధంగా 23 వేల ఓట్ల మెజారిటీతో గెలిచిన దగ్గుపాటి ప్రసాద్ పై నోటికి ఎంత వస్తే అంత మాట్లాడుతున్నారన్నారు. మీకు ఎవరు స్క్రిప్ట్ రాసిస్తే ఇది మాట్లాడుతున్నారో.. చెప్పాలన్నారు. భూ ఆక్రమణలు, వసూళ్లు, చికెన్ షాపుల్లో కమీషన్లు అంటూ మాట్లాడుతున్నారని అయితే వీటిలో ఏ ఒక్కదానికైనా మీ వద్ద ఆధారాలు ఉన్నాయా అని నిలదీశారు. నగరంలో జరుగుతున్న మహాసభలకు చందాలు ఇవ్వలేదన్న కారణంతోనే ఎమ్మెల్యే దగ్గుపాటిపై ఇలాంటి విమర్శలు చేస్తున్నారన్నారు.

అంటే మీకు డబ్బు ఇవ్వకపోతే ఎవరి మీద అయినా ఇలాంటి ఆరోపణలు చేస్తారా అంటూ ప్రశ్నించారు. సిపిఐ మహాసభలు జరిగినప్పుడు గతంలో రామకృష్ణ ఎర్రచొక్కా వేసుకొని కనిపించే వారిని.. కానీ ఇప్పుడు ఖద్దరు చొక్కాలు వేసుకొని.. ప్రభుత్వంతోపాటు ఎమ్మెల్యేల గురించి మాట్లాడటానికి వచ్చినట్టు ఉందన్నారు. గతంలో తెలుగుదేశం పార్టీ దయవల్ల గెలిచిన మీరు ఆ తర్వాత కనీసం డిపాజిట్లు కూడా తెచ్చుకోలేదన్న విషయాన్ని మర్చిపోవద్దన్నారు. అస్రా ఆప్టికల్స్ పై దాడి చేసే తాళాలు వేసిన వారిని పోలీసులు అరెస్టు చేశారన్నారు. డబుల్ రిజిస్ట్రేషన్ జరిగిందా లేదా అన్నది చట్ట ప్రకారం తేలుతుందన్నారు. బుడబుక్కల వారు అంటూ ఒక కులాన్ని తక్కువ చేసి మాట్లాడుతున్నారని.. అంటే ఆ కులం మీద అంత చిన్న చూపు ఉందా అని ప్రశ్నించారు. ఎవరు డబ్బు ఇస్తే వారి వైపు మాట్లాడుతారా అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వేల మందికి పట్టాలు ఇచ్చామని చెప్పుకుంటున్న మీకు ఎన్ని ఓట్లు పడుతున్నాయో ఒకసారి తెలుసుకోవాలన్నారు. మీరు ఇలాంటి చర్యలు మానుకోకపోతే డిపాజిట్లు సంగతి పక్కన పెడితే కనీసం ఒక్క ఓటు కూడా రాదన్నారు. కొంతమంది అవుట్ డేటెడ్ పొలిటిషన్లంతా కలిసి ఎమ్మెల్యే దగ్గుపాటిని టార్గెట్ చేశారన్నారు. నగరంలో ఆయన చేస్తున్న అభివృద్ధి మీకు కనిపించడం లేదా అంటూ నిలదీశారు. గత ఐదేళ్లలో మీరంతా ఎక్కడికి వెళ్లారని... అప్పటి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి గురించి ఏ రోజైనా మాట్లాడారా అంటూ నిలదీశారు.

తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మీలాంటి వారికి మాట్లాడే స్వేచ్ఛ కల్పించారని.. కానీ మా పైనే ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలో సిపిఐని అడ్డం పెట్టుకొని మీ పార్టీ నాయకులు చేస్తున్న భూ అక్రమాల బండారాన్ని త్వరలోనే బయటపెడతామన్నారు. చంద్రబాబుతో పాటు మా పార్టీ ఎమ్మెల్యేల గురించి నోరు జాగ్రత్తగా పెట్టుకుని మాట్లాడాలని హెచ్చరించారు.

### ప్రత్యామ్నాయ రాజకీయాల దిశగా

# సీపీఐ రాష్ట్ర 28వ మహాసభలు

**- ఆగస్టు 23న చలో ఒంగోలు**
**గోడపత్రాల విడుదలలో**
**సిపిఐ జిల్లా కార్యదర్శి పి మహేష్ పిలుపు**



**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం, ఆగస్టు 13:** రాష్ట్రంలో అవినీతి పాలనకు చరమగీతం పాడి ప్రత్యామ్నాయ రాజకీయాల దిశగా రాష్ట్ర సమగ్ర అభివృద్ధి సామాజిక న్యాయం సాధనే లక్ష్యంగా భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) 28వ రాష్ట్ర మహాసభలు వేదిక కాబోతున్నట్లు ఒంగోలులో జరగబోతున్న సిపిఐ రాష్ట్ర 28వ మహాసభలు సందర్భంగా ఆగస్టు 23 వ తేదీ జరిగే భారీ ప్రదర్శన బహిరంగ సభకు విద్యార్థి యువజన కార్మిక కర్షక రైతు ప్రజాస్వామ్యవాదులు పాల్గొనాలని బుధవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో మహాసభల గోడపత్రాలను విడుదల చేసిన సిపిఐ జిల్లా కార్యదర్శి పి మహేష్ పిలుపునిచ్చారు. ఈ మహాసభలకు సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజా, జాతీయ కార్యదర్శి కె నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, రావుల వెంకయ్య, రాష్ట్ర సహాయ కార్యదర్శిలు ముప్పాళ్ళ నాగేశ్వరరావు, జెవి సత్యనారాయణమూర్తి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య లతోపాటు వందలాది మంది కళాకారులు సినీ కళాకారులు ప్రజాస్వామ్యవాదులు హాజరుకానున్నట్లు వారు తెలిపారు.

దేశంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్.డి.ఏ 2014 ఎన్నికల్లో నల్లధనం వెలికితీత, పన్నుల భారం తగ్గింపు, ధరల నియంత్రణ, ప్రతి ఒక్కరికి తమ అకౌంట్లలలో 15 లక్షల డబ్బు జమ, ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాల కల్పన వంటి వాగ్దానాల అమలులో పూర్తిగా విఫలమైపోయి. శ్రమజీవుల స్వేదంతో నిర్మితమైన ప్రభుత్వరంగ సంస్థలను అంబానీ, ఆదానీలాంటి సంస్థలకు కారుచౌకగా అమ్మేస్తున్నారని. బ్యాంక్ రుణాల పేరుతో కోట్లాది రూపాయలు కొల్లగొట్టి విదేశాలకు పారిపోయే విజయామాల్యా, నీరవ్ మోడీ, లలిత్ మోడీ లాంటి వారికి ఎర్ర తివాచి పరిచి సాగనంపు తున్నారని. ఖనిజ నిక్షేపాలను కొల్లగొట్టేందుకు ఆపరేషన్ ఖగార్ పేరుతో గిరిజనులను మావోయిస్టులను అంతం చేస్తున్నారని దేశంలో సంపదను సృష్టించడంలో భాగస్వామ్యమవుతున్న కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మికచట్టాలను మార్పు చేసి నాలుగు లేబర్ కోడ్ లను తెచ్చి దోపిడీకి చేసుకోవడానికి అవకాశాలు కల్పించాలని. ఉన్న వాడికి లేనివాడికి అంతరం పెంచింది.ప్రజలు, ప్రజా సమస్యలు పూర్తిగా పక్కకునెట్టి నిరుద్యోగ సమస్య తీర్చకుండా తినే తిండిపైన, కట్టుకునే బట్టలపైన ఆంక్షలు విధించి, కులంపేరుతో, మతం పేరుతో, భావం పేరుతో, భాష పేరుతో, దేవుని పేరుతో, దేశభక్తి అంటేనే బిజెపికి పేటెంట్ గా ప్రజల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టి తద్వారా రాజకీయ లబ్ధిపొందాలని చూస్తున్నది. సిఏఏ, ఎన్ఆర్సి, ఎన్పిఆర్, వక్ఫ్ చట్ట సవరణ ప్రజల ఐక్యతను దెబ్బతీస్తున్నది. ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా రాష్ట్రాలకు ఉన్న హక్కులను కాలరాస్తూ, స్వతంత్ర దర్యాప్తు సంస్థలను రాజకీయ స్వార్థానికి దుర్వినియోగం చేస్తూ అప్రకటిత ఎమర్జెన్సీ అమలు చేస్తున్నది. విద్యారంగంలో మత విద్వేషాలను చొప్పిస్తున్నది. రాజ్యాంగంపై, రిజర్వేషన్లపై చర్చకు పెట్టి సనాతనం పేరుతో, మనువాదం పేరుతో మనుషులను విడదీస్తోంది.

విభజన హామీలయిన రాష్ట్రానికి ప్రత్యేక హెూదా, వెనకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ, జాతీయ హెూదా కలిగిన పోలవరం ప్రాజెక్టు పూర్తికి నిధులు, రాష్ట్ర రాజధాని నిర్మాణ బాధ్యత ,రాయలసీమకు చెందవలసిన నీటి వాటాలను కూడా దక్కకుండా రాయలసీమను శాశ్వతంగా ఎడారి చేసేందుకు కుట్రలు చేస్తున్నారని. దేశ సార్వభౌమత్వాన్ని అమెరికాకు తాకట్టుపెట్టి, ఉగ్రవాదంపై పోరాటం పేరుతో దేశంలో ఉన్న ప్రతిపక్షాలపై, ముఖ్యంగా ప్రశ్నించే గొంతుకులను హతమారుస్తున్నారని అన్నారు.

రాష్ట్రంలో తీర్చలేని వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో చెప్పిన సూపర్సిక్స్ పథకాలయిన పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు, ఇంటి నిర్మాణానికి 4 లక్షల పథకాన్ని పూర్తిగా పక్కన పెట్టిందని. మహిళలకు ఉచిత బస్సు, రైతులకు అన్నదాతా సుఖీభవ అమలులో వాయిదాల పర్వం కొనసాగుతోందని. ఉచిత గ్యాస్ పథకానికి ఊతం లేదు, మహిళా శక్తిలో సారంలేదు. ఫీజు రీయంబర్స్మెంట్, స్కాలర్షిప్లపై ప్రభుత్వంపై నమ్మకం పోయి విద్యార్థులపై వత్తిడి పెరిగిందని. నిరుద్యోగ భృతి నీరుగారిపోయి నోటిఫికేషన్లపై ఆశలు వదులుకుంటున్నారని ఎస్సి, ఎసిటి లకు రాయతీ రుణాలు అందని ద్రాక్షలా మారాయి. ఎన్నికల వాగ్దానాలు అమలు చేయకుండా పి4 పేరుతో ప్రజలను మభ్యపెడుతూ ఉద్యోగ వర్గాలపై నిర్భంద వసూలును ఉసిగొల్పుతున్నది. పాలించే పాలకులెవరైనా కేంద్రంలో బిజెపితో అంటకాగుతూ రాష్ట్ర అభివృద్ధికి అవసరమయిన నిధులు రాబట్టకుండా, కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక చట్టాల రూపకల్పనలో బేషరతుగా మద్దతు తెలుపుతున్నాయి. రాష్ట్రంలో ల్యాండ్, స్యాండ్, మైన్, వైన్ మాఫియా రాజ్యమేలుతోంది. ఎన్నికల ముందు ఉద్యోగ, ఉపాధ్యా యులకు కార్మికులకిచ్చిన వాగ్దానాలు డి.ఏ బకాయిలు, సిపిఎస్ రద్దు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీసవేతనం, పనిగంటల అమలు, రెగ్యులరైజ్, అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు అమలుకు నోచుకోవడం లేదు. కరువు. వలసలు, ఆత్మహత్యల శాశ్వత విముక్తికి పెండింగ్లో ఉన్న గాలేరు–నగరి, హంద్రీ–నీవా, జురీకోన, వెలిగల్లు ప్రాజెక్టులు, పంటకాలువల పూర్తికి , తెగిపోయిన అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణానికి నిధులు, నికర జలాల కేటాయింపులో నిర్లక్ష్యం చేస్తున్నది అన్నారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోపు కిష్టప్ప, జిల్లా కార్యవర్గ సభ్యులు సిద్దిగాళ్ళ శ్రీనివాసులు, మనోహర్ రెడ్డి, సాంబశివ, కే మురళి, మండెం సుధీర్ , ఎం శివరామకృష్ణదేవరా, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమల రంగారెడ్డి, ఈఐఓఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కల వెంకటేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవ్ కుమార్, దళిత కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు హరి, సిపిఐ నాయకులు నిజాం తదితరులు పాల్గొన్నారు.

# విలేకరినంటూ ఎర్రచందనం స్మగ్లింగ్

**-మాజీ ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడిగా చలామణి**
**-వైసీపీ కమలాపురం సోషల్ మీడియా వింగ్**
**-మండల టీడీపీ నాయకులు ఆటో బాబు**



**చెన్నూరు –సూర్య వాస్తవం, ఆగస్టు 13:** వైయస్సార్సీపి కమలాపురం సోషల్ మీడియా వింగ్ అయినటువంటి మిట్టా మాధవరెడ్డి అను వ్యక్తి నేను సాక్షి విలేకరిని అని చెప్పుకుంటూ, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే వెంట తిరుగుతూ, ఆయన ముఖ్య అనుచరుడిగా చలామణి అవుతూ, మోస్ట్ వాంటెడ్గా ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తూ పట్టుబడిన మిట్టా మాధవరెడ్డి సాక్షి పత్రిక విలేఖరి ముసుగులో అతను చేసిన దందాలు, అతను పాల్పడిన బ్లాక్ మెయిల్ లు అంతా ఇంతా కాదని అతని జీవితమంతా కూడా నేరమయమేనని టిడిపి బిసి నాయకులు ఆటో బాబు తెలిపారు. బుధవారం ఆయన స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చెన్నూరు లోని బుడ్డాయ పల్లి గ్రామానికి చెందిన మిట్టా మాధవరెడ్డి నేను నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్చార్జి నంటూ అతను సోషల్ మీడియాలో కొన్ని గ్రూపులు క్రియేట్ చేసుకుని అందులో తనకు ఇష్టం వచ్చిన విధంగా పోస్టులు పెట్టుకుంటూ తన దందాలను యదేచ్ఛగా కొనసాగించారని తెలిపారు. అంతేకాకుండా డబ్బున్న నాయకులను అలాగే ధనికులను టార్గెట్ చేసుకొని వారి వ్యక్తిగత కార్యకలాపాలపై దృష్టి పెట్టి వారిని బ్లాక్ మెయిల్ కు గురిచేస్తూ వారిని వ్యక్తిగతంగా భయపడిస్తూ డబ్బులు డిమాండ్ చేస్తాడని తెలిపారు. వారు డబ్బులు ఇవ్వకుంటే తన సోషల్ మీడియాలో వారిపై అసత్యంగా, అసభ్యకరంగా పోస్టులు పెడుతూ ఉండేవాడని పేర్కొన్నారు. ఇలాంటి తరుణంలోనే మిట్టా మాధవరెడ్డిని మంగళవారం అటవీ శాఖ అధికారులు వారికి అందిన సమాచారం మేరకు ఎర్రచందనం స్మగ్లింగ్ పాల్పడిన మోస్ట్ వాంటెడ్ ఎర్రచందనం స్మగ్లర్ ను అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. ఎర్రచందనం స్మగ్లీ చేస్తూ పట్టుబడ్డ మిట్టా మాధవరెడ్డి నేర చరిత్ర కలిగినవాడని, ఎప్పుడు క్రిమినల్ ఆలోచనలే తప్ప మరే ఇతర ఆలోచన లేదని ఆయన తెలిపారు. పోలీస్ అధికారులు నాకు బాగా తెలుసని నేను ఎలా చెబితే వారు అలా వింటారు అని చెబుతూ కొద్దిరోజులు ఎక్కువగా పోలీస్ స్టేషన్లోనే ఆయన కొన్ని పంచాయితీలు కూడా చేయడం జరిగిందని ఒక పోలీస్ అధికారితో కూడా అతను ఎంతో సఖ్యతగా ఉన్నాడని కొంతమంది ప్రజలు అప్పట్లో గుసగుసలాడుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. ఆ సఖ్యతను అలుసుగా తీసుకున్న మిట్టా మాధవరెడ్డి ఇంకా రెచ్చిపోయారని ఇంకా యదేచ్ఛగా తన మోసాలను కొనసాగించారని ఆయన తెలిపారు.అదేవిధంగా మిట్టా మాధవరెడ్డి బయట ప్రాంతాలలో సెటిల్మెంట్లకు వెళ్లి దౌర్జన్యాలు చేస్తూ ఉండేవాడని, కమలాపురం నియోజకవర్గ పరిధిలో చాలామందిని అతను మోసం చేశాడని ఆయన తెలిపారు. అలాంటివాడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ లో ఉండి మాజీ ఎమ్మెల్యే వెంట తిరుగుతూ, వైఎస్ఆర్సిపి కమలాపురం సోషల్ మీడియా వింగ్ గా పనిచేస్తూ, అలాగే నేను సాక్షి విలేకరిని అని చెప్పుకుంటూ మోసాలకు పాల్పడుతున్నాడని ఆయన మాధవ రెడ్డి చేసిన అవినీతి పనులపై ధ్వజమెత్తారు. ఇవే కాకుండా అతను చేసిన మోసాలు ఇంకా ఎన్నో ఉన్నాయని, ఏది ఏమైనా అతనిని అధికారులు పూర్తిస్థాయిలో విచారించి అతనికి తగిన శిక్ష అదే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. అంతేకాకుండా మిట్ట మాధవరెడ్డి చేసినటువంటి పాపాలన్ని కూడా ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని అతనికి శిక్ష పడడం ఖాయమని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. ఇంత చేస్తున్న ఏ రోజు కూడా అటు వైయస్ఆర్సీపీ పార్టీ కానీ, వైఎస్ఆర్సిపి నాయకులు కానీ అతను చేస్తున్న పనులకు మాకు ఎలాంటి సంబంధం లేదని చెప్పకపోవడం గమనార్హం. ఈ కార్యక్రమంలో టిడిపి యువ నాయకులు కల్లూరు ఓబుల్ రెడ్డి, పాలగిరి రమణారెడ్డి, ప్రవీణ్ కుమార్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి (టైగర్ బ్రదర్స్) తదితరులు పాల్గొన్నారు.

# పిడుగుపాటు, మెరుపు నుండి రక్షణ పొందాలి

**డిఆర్ఓ ఏ.మలోల**



**అనంతపురం కలెక్టరేట్ – సూర్య వాస్తవం, ఆగస్టు 13 :** పిడుగుపాటు, మెరుపు నుండి రక్షణ పొందడానికి సరళమైన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని డిఆర్ఓ ఏ.మలోల పేర్కొన్నారు. బుధవారం అనంతపురం కలెక్టరేట్లో జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ (ఏపిఎస్డిఎంఏ) ఆధ్వర్యంలో పిడుగుపాటు భద్రతా రథంను డిఆర్ఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ పిడుగుపాటు, మెరుపు నుండి రక్షణ చర్యలపై అవగాహన కల్పించేందుకు పిడుగుపాటు భద్రతా రథంను ప్రారంభించడం జరిగి oదన్నారు. పిడుగుపాటు భద్రతా రథం జిల్లాలోని విడపనకల్లు మండలంలోని పాల్తూరు గ్రామంలో ఈనెల 14వ తేదీన, సింగనమల మండలంలోని ఉల్లికల్లు గ్రామంలో 15వ తేదీన, పెద్దవడుగూరు మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో 16వ తేదీన, డి.హీరేహాల్ మండలంలోని దొడగట్ట గ్రామంలో 17వ తేదీన అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మెరుపు, పిడుగుపాటు గురించిన అపోహలు మరియు సత్యాలు, మెరుపులు వచ్చే ముందు, పిడుగులు పడే సమయంలో, పిడుగులు పడిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరి దేవి, డిజాస్టర్ మేనేజ్మెంట్ డిప్యూటీ తహసీల్దార్ భాష, కలెక్టర్ హెచ్ సెక్షన్ కార్యాలయం సిబ్బంది శ్రీనాథ్ బాబు, శ్రీ తేజ, జిలాన్ భాష, మహమ్మద్ షఫీ, పవన్ కుమార్, పురుషోత్తం, విశ్వనాథ్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

### కుంభాభిషేక వేడుకల్లో చాగణం

# ట్రస్ట్ అధినేత గౌరీ శంకర్ దంపతులు





**పెళ్లకూరు–సూర్యా వాస్తవం, ఆగస్టు 13 :** తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం. పెళ్లకూరు గ్రామంలో స్థానికంగా వెలసియున్న శ్రీ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు మూడవరోజు ముగియనుంది. చోళ రాజుల కాలంలో నిర్మించి విశేష పూజలు అందుకున్న ఈ పురాతన ఆలయం శిథిలావస్థకు చేరడంతో దానిని పూర్తిగా తొలగించి దాని స్థానంలో నూతన ఆలయాన్ని గ్రామస్తులంతా కలిసి చాగణం లలితమ్మ భాస్కర రావు చారిటబుల్ ట్రస్ట్ అధినేత గౌరీ శంకర్ సహకారంతో నిర్మించడం జరిగింది. ఈ నూతన ఆలయాన్ని నిర్మించి నేటికీ 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పుష్కర (ద్వాదశ వర్షా) అష్ట బంధన, కుంభాభిషేక మహోత్సవములు ఈరోజుతో ముగియనుంది. ఈ కుంభాభిషేక మహోత్సవంలో చాగణం ట్రస్ట్ అధినేత గౌరీ శంకర్ ఆయన సతీమణి వరలక్ష్మి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారిని వేద పండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాయసం ఋషికేశవరావు, రాయసం శ్రీలక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

# హార్ ఘర్ తిరంగా ర్యాలీలో కమిషనర్ షేక్ ఫజులుల్లా






**నాయుడుపేట –సూర్య వాస్తవం, ఆగస్టు 13:** నాయుడుపేట పట్టణంలో బుధవారం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని గాంధీ మందిరం వద్ద నుండి బజారు వీధి,దర్గా రోడ్డు మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు 500 మీటర్ల పొడవు గల జాతీయ జెండాను ప్రదర్శించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ షేక్. ఫజులుల్లా మాట్లాడుతూ79 స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ,మెప్మా,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్గా నానబాల సుబ్బారావు



**నాయుడుపేట –సూర్య వాస్తవం, ఆగస్టు 13:** నాయుడుపేట గ్రామదేవత శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్గా తెలుగుదేశం పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి నానబాల సుబ్బారావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ఎండోమెంట్ శాఖ కమిషనర్ నాయుడుపేట శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ ని ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ గా నానబాల సుబ్బారావు, కమిటీ సభ్యులుగా ఆబోతుల బాబు, వినుకొండ మంజుల, పాలెం సాయి శిరీష, రావూరు హైమావతి, పంగూరు నరోత్తమ రెడ్డి, పచ్చి సుబ్బలక్షమ్మ, ఏవీఎస్ రవీంద్ర, ఎక్స్ అఫిషియో మెంబర్ గా ఆర్ ముని సురేష్ లను నియమిస్తూ ఎండోమెంట్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ గా తనను నియమించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం లతోపాటు తెలుగుదేశం పార్టీ అధిష్టానానికి నానబాల సుబ్బారావు కృతజ్ఞతలు తెలియజేశారు.తనకు అప్పగించిన బాధ్యతను పార్టీ ఆదేశానుసారం పనిచేసి నీ పోలేరమ్మ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్గా నియమితులైన నానబాల సుబ్బారావుకు పలువురు పార్టీ నాయకులు,మిత్రులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలియజేశారు.



## సౌత్ క్యారెక్టర్లే గొప్ప..
# నార్త్ లో అన్నీ మర్చిపోయేవే: పూజ

**- ఆ తర్వాత టాలీవుడ్ లో మార్కెట్ డౌన్ అయింది ఇప్పుడు మళ్లీ అవకాశాలు వస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది**

పొడుగు కాళ్ళ సుందరి పూజా హెగ్డే పాన్ ఇండియా హీరోయిన్ అని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. హిందీ, తెలుగు, తమిళ భాషల్లో నటిస్తోంది అమ్మడు. ఇప్పుడు వివిధ బాలీవుడ్, కోలీవుడ్ చిత్రాల్లో నటిస్తున్నా.. టాలీవుడ్ ద్వారా మంచి క్రేజ్ సంపాదించుకుంది. స్టార్ హీరోల సరసన నటించిన ఆమెకు సూపర్ హిట్స్ సొంతమయ్యాయి.ఆ తర్వాత టాలీవుడ్ లో మార్కెట్ డౌన్ అయింది. ఇప్పుడు మళ్లీ అవకాశాలు వస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. అదే సమయంలో బాలీవుడ్, కోలీవుడ్ లో యాక్ట్ చేస్తోంది పూజా హెగ్డే. తమిళంలో కొంచెం బిజీగా ఉన్న బ్యూటీ.. హిందీలో మాత్రం యమా బిజీగా ఉందని చెప్పాలి. ఇప్పుడు కూలీలో మోనిక సాంగ్ తో సందడి చేయనుంది.ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. బాలీవుడ్ తనకు సరైన పాత్రలు ఇవ్వలేదని వ్యాఖ్యానించిన పూజ.. అక్కడి వాళ్లు తనను ఎప్పుడూ గ్లామర్ హీరోయిన్ లాగే చూశారని తెలిపింది అమ్మడు. చెప్పాలంటే.. పెద్దగా గుర్తింపు లేని పాత్రలు ఇచ్చారని పూజా చెప్పడం గమనార్హం.తాను చేసిన ఆ రోల్స్ అన్నీ మర్చిపోయేవే అని తెలిపింది. కానీ సౌత్ సినిమాల్లో మాత్రం తనకు మంచి మంచి క్యారెక్టర్లు దక్కాయని చెప్పిన పూజ.. రీసెంట్ గా ఆమె నటించిన రెట్రో మూవీ కోసం ప్రస్తావించింది. స్టార్ హీరో సూర్య లీడ్ రోల్ లో నటించిన ఆ సినిమాలో రుక్మిణీ రోల్ లో సందడి చేసి తన నటనతో మెప్పించింది పూజా హెగ్డే.మూవీలో తన రోల్ ను డైరెక్టర్ కార్తీక్ సుబ్బరాజు అద్భుతంగా డిజైన్ చేశారంటూ కొనియాడింది. తాను ఎలాంటి రోల్ అయినా ఎలా పెర్ఫామ్ చేయగలనో ఆ సినిమా చూపించిందని చెప్పిన ఆమె.. ఇలాంటి పాత్రలు మరిన్ని చేయాలని ఉందని తన మనసులోని మాటను బయట పెట్టింది. మొత్తానికి సౌత్ లో గొప్ప గొప్ప క్యారెక్టర్లు చేశానని చెప్పుకొచ్చింది. అయితే సౌత్‌లో కొన్ని సినిమాలు చేసి మంచి క్రేజ్ సంపాదించుకుని.. బాలీవుడ్‌కు వెళ్లాక అనేక మంది హీరోయిన్స్ ఇక్కడి సినిమాలను తక్కువ చేసి మాట్లాడుతుంటారు. ఇక్కడ క్రేజ్ తగ్గి అక్కడ గ్లామరస్ రోల్స్ చేస్తుంటారు. కానీ సౌత్ సినిమాలపై బురదజల్లుతంటారు. కానీ పూజ మాత్రం భిన్నమైన వైఖరిని తీసుకున్నారు. తన వ్యాఖ్యలతో అందరినీ ఆశ్చర్య పరిచారు.

## రాజాసాబ్ మేకర్స్‌కు
# కోర్టు కష్టాలు... ఏం జరిగిందంటే?



**- ఇక డిసెంబర్ 05న రిలీజ్ ఉంటుందని ఇప్పటికే ప్రకటన చేసినా.. ఆ రోజు కూడా విడుదలవ్వడం డౌట్ గానే ఉంది**

రెబల్ స్టార్ ప్రభాస్ రాజాసాబ్ విడుదల వాయిదా పడుతూ వస్తోంది. ఇక డిసెంబర్ 05న రిలీజ్ ఉంటుందని ఇప్పటికే ప్రకటన చేసినా.. ఆ రోజు కూడా విడుదలవ్వడం డౌట్ గానే ఉంది. ఈ నేపథ్యంలో మేకర్స్ కు కొత్త చిక్కులు వచ్చి పడ్డాయి. ఈ సినిమా మేకింగ్ సంస్థలుగా ఉన్న పీపుల్ మీడియా ఫ్యాక్టరీ–ఢిల్లీకి చెందిన ఐవీ ఎంటర్టైన్మెంట్ సంస్థలు కోర్టుకెక్కాయి. అసలు ఏం జరిగిందంటే? ఐవీ ఎంటర్టైన్మెంట్ సంస్థ రాజాసాబ్ సినిమా నిర్మాణంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీతో కో ప్రొడ్యూసర్ గా డీల్ కుదుర్చుకుంది. సినిమా నిర్మాణం కోసం ఐవీ ఎంటర్టైన్మెంట్ రూ.225 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. అందులో భాగంగానే రూ.218 కోట్లు వెచ్చించింది. అయితే ఆ తర్వాత పలు కారణాల వల్ల అగ్రిమెంట్ రద్దు చేసుకోవాలనుకుంటున్నట్లు ఐవీ ఎంటర్టైన్మెంట్ పేర్కొంది. పలు కారణాలు చెప్పి అప్డేట్లు ఇవ్వడం సేదని ఐవీ ఎంటర్టైన్మెంట్ ఆరోపణలు చేసింది. అందుకే ఈ అగ్రిమెంట్ నుంచి తప్పుకుంటున్నట్లు ఐవీ చెప్పింది. అయితే సడెన్ గా ఒప్పందం రద్దు చేసుకుంటాననడంపై పీపుల్ మీడియా ఫ్యాక్టరీ కోర్టుకు వెళ్లింది. ఇలా ఒప్పందం మధ్యలోనే రద్దు చేసుకోవడం చట్ట విరుద్ధం అని పేర్కొంది. ఐవీ ఎంటర్టైన్మెంట్ సంస్థ పెట్టినదానికంటే ఎక్కువగానే సినిమాకు ఖర్చైందని.. ప్రస్తుతం షూటింగ్ నడుస్తుందని, అనుకోని కారణాలతో సినిమా డిలే అవుతుందని.. కానీ అంతలోనే ఇలా తమ పరువుకు భంగం కలిగిస్తున్నారని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ కోర్టులో పిటిషన్ వేసింది. దీంతో ఐవీ ఎంటర్టైన్మెంట్ సంస్థ కూడా కోర్టుకు వెళ్లింది. తమకు డీల్ వద్దని, తాము పెట్టుబడిగా పెట్టిన డబ్బును 18 శాతం వడ్డీతో ఇప్పించాలని పిటిషన్ లో పేర్కొంది. ప్రస్తుతం ఈ రెండు పిటిషన్లు కోర్టులో పెండింగ్ లో ఉన్నాయి. అయితే ఐవీ పెట్టుబడి మొత్తాన్ని సినిమా రిలీజ్ కంటే ముందు కోర్టులో డిపాటిజ్ చేయడానికి సిద్ధమేనని, కానీ ఈ సినిమా డిస్ట్రిబ్యూషన్?, మార్కెటింగ్ లో ఐవీ జోక్యం ఉండకూడదని పీపుల్ మీడియా కోరింది. చూడాలి మరి కోర్టు తీర్పు ఎలా ఉండనుందో!?



## టీమిండియాకు
# ఆసియా కప్ సవాళ్లు: జట్టులో స్థానం ఎవరికి?

ఆసియా కప్ కోసం భారత జట్టు ఎంపిక ప్రస్తుతం క్రికెట్ వర్గాల్లో ఉత్కంఠ రేపుతోంది. ముఖ్యంగా కీలకమైన స్థానాలైన వైస్ కెప్టెన్సీ, ఓపెనింగ్ స్లాట్స్‌తో పాటు మిడిల్ ఆర్డర్ కూర్పుపై విస్తృతమైన చర్చ జరుగుతోంది. ఇప్పటికే గాయం నుంచి కోలుకున్న సూర్యకుమార్ యాదవ్ జట్టు పగ్గాలు చేపట్టడం ఖాయంగా కనిపిస్తోంది. కానీ, మరికొన్ని స్థానాల విషయంలో మాత్రం సందిగ్ధత కొనసాగుతోంది.

**-వైస్ కెప్టెన్ ఎవరు?:**వైస్ కెప్టెన్సీ రేసులో ఇద్దరు యువ ఆటగాళ్ల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి: అక్షర్ పటేల్ , శుభ్‌మన్ గిల్. ఇద్దరూ ఇటీవల అద్భుతమైన ప్రదర్శన కనబరుస్తున్నారు. అక్షర్ పటేల్ తన ఆల్రౌండర్ నైపుణ్యంతో జట్టుకు సమతూకం తెస్తుంటే, శుభ్‌మన్ గిల్ బ్యాటింగ్‌లో నిలకడగా రాణిస్తున్నాడు. వీరిలో ఎవరికి ఈ కీలక బాధ్యత దక్కుతుందనేది ఆసక్తికరంగా మారింది.

**-ఓపెనింగ్ స్లాట్స్:**యశస్వి జైస్వాల్, సాయి సుదర్శన్ వంటి యువ ఓపెనర్లు ఉన్నప్పటికీ, ప్రస్తుత ఫామ్‌ను బట్టి చూస్తే అభిషేక్ శర్మ , సంజు శాంసన్ తుది జట్టులో స్థానం దక్కించుకునే అవకాశం ఎక్కువగా ఉంది. వీరిద్దరూ ఇటీవలి మ్యాచ్‌లలో నిలకడైన ప్రదర్శనతో ఆకట్టుకున్నారు, దీంతో టాప్ ఆర్డర్ దాదాపుగా ఖరారైనట్టే కనిపిస్తోంది.

**-కేఎల్ రాహుల్ పరిస్థితి:**గత కొంతకాలంగా మిడిల్ ఆర్డర్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోతున్న కేఎల్ రాహుల్ ను ఈసారి ఆసియా కప్ జట్టు నుంచి తప్పించే అవకాశం ఉంది. ఈ నిర్ణయం జట్టు కూర్పులో ఒక పెద్ద మార్పు కానుంది.

**-తుది జట్టు ప్రకటన ఎప్పుడు?:**

ఆగస్టు 19 లేదా 20న తుది జట్టును ప్రకటించే అవకాశం ఉంది. ఆసియా కప్ సెప్టెంబర్ 9న ప్రారంభం కానుండగా, సెప్టెంబర్ 10న యుఏఈతో భారత్ తమ తొలి మ్యాచ్ ఆడనుంది.ఎవరు తుది జట్టులో చోటు దక్కించుకుంటారు.. ఎవరు నిరాశకు గురవుతారు అనేది మరికొద్ది రోజుల్లో తేలనుంది. ఈ టోర్నమెంట్‌లో టీమిండియా ప్రదర్శన ఎలా ఉంటుందో చూడాలి.




# వన్డే సిరీస్ విజేత వెస్టిండీస్

## - మూడో మ్యాచ్‌లో పాక్‌పై 202 పరుగుల తేడాతో గెలుపు




**ట్రినిడాడ్:** నిర్ణయాత్మక మూడో, చివరి వన్డేలో వెస్టిండీస్ 202 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. విండీస్ ఫాస్ట్ బౌలర్ జేడన్ సీల్స్ ఆరు వికెట్లు తీసుకోగా, కెప్టెన్ శాయ్ హోప్ అజేయ సెంచరీతో ఆకట్టుకున్నాడు. దీంతో వన్డే సిరీస్‌ను విండీస్ 2-1తేడాతో కైవసం చేసుకుంది. 1991 తర్వాత అంటే.. 34ఏళ్ల తర్వాత పాక్‌తో జరిగిన వన్డే సిరీస్‌ను విండీస్ గెలుచుకుంది. మూడో వన్డేలో తొలుత బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ నిర్ణీత 50 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 294 పరుగులు చేసింది. విండీస్ జట్టులో కెప్టెన్ హోప్(120నాటౌట్) సెంచరీతో రాణించాడు. అతని ఇన్నింగ్స్‌లో 10 ఫోర్లు, అయిదు సిక్సర్లు ఉన్నాయి. రోస్టన్ ఛేజ్(36), జస్టిన్ గ్రీవ్స్(43) పరుగులతో రాణించారు. విండీస్ 42 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 184 పరుగులతో కష్టాల్లో పడింది. ఆ దశలో హోప్, గ్రీవ్స్ భారీ షాట్లతో 8 ఓవర్లలో 110 పరుగులు జతచేశారు. పాక్ బౌలర్లలో నసీమ్ షా, అబ్రార్ అహ్మద్ రెండేసి వికెట్లు తీసుకున్నారు. 295 టార్గెట్‌తో బరిలోకి దిగిన పాకిస్థాన్‌కు విండీస్ ఫాస్ట్ బౌలర్ జేడన్ సీల్స్(6/18) షాకిచ్చాడు. దీంతో పాకిస్తాన్ 29.2ఓవర్లలో 92 పరుగులకే ఆ జట్టు ఆలౌటైంది. అఘా సల్మాన్(30), నవాజ్(23), హసన్ నవాజ్(13) మాత్రమే రెండంక్కెల స్కోర్ చేశారు. మోటీకి రెండు, ఛేస్‌కు ఒక వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ హోప్‌కు, సిరీస్ సీల్స్‌కు దక్కాయి.


## 17 తర్వాత డీఎస్సీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్



**నెల్లూరు– సూర్యవాస్తవం:** ఆంధ్రప్రదేశ్ డీఎస్సీ ఫలితాలు విడుదలయ్యాయి. క్వాలిఫై అయిన అభ్యర్థులు తమ స్టాటస్ ఏంటో? జిల్లాలో, జోన్‌లో తామ ర్యాంకు ఎంతో ఉద్యోగం వస్తుందో రాదో అన్న చర్చ నడుస్తోంది. జిల్లా ఆయా సబ్జెక్టుల్లో టాప్ మార్కులు ఎన్ని కటాఫ్ ఎంత ఉండొచ్చు అనే వివరాలపై ఆరా తీస్తున్నారు. స్కోర్ కార్డును అధికారిక వెబ్‌సైట్‌లో పెట్టిన అధికారులు మరో రెండు రోజుల్లో మెరిట్ లిస్ట్ విడుదల చేసేందుకు అవకాశం ఉంది. సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఎప్పటి నుంచి ఉంటుందో అనే విషయాలపై చర్చించుకుంటున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ అనేది జిల్లా స్థాయి, జోన్ స్థాయి అభ్యర్థుల కోసం నిర్వహించే పరీక్ష. ఉద్యోగాల నియామకం జిల్లాల వారీగా, జోన్‌ల వారీగా భర్తీ చేస్తారు. ఇదే విషయం నోటిఫికేషన్ టైంలోనే వెల్లడించారు. ఏ జిల్లాకు ఏ సబ్జెక్ట్ ఎన్ని ఉద్యోగాలు ఉన్నాయ. ఏ జోన్‌లో ఎన్ని ఉద్యోగాలు ఉన్నాయో స్పష్టంగా తెలియజేశారు. ఏ కేటగిరికి ఎన్ని ఉద్యోగాలు వస్తున్నాయి. నాన్ లోకల్ అభ్యర్థులకు ఎన్ని ఉద్యోగాలు ఇస్తారో కూడా ముందే లెక్కలు వేసి చెప్పేశారు.సాధారణంగా పరీక్ష తర్వాత జరిగే ప్రక్రియ నోటిఫికేషన్ టైంలోనే జరిగిపోయినందున మెరిట్ జాబితా తయారు చేయడం పెద్ద సమస్యగా ఉండదు. న్యాయపరమైన చిక్కులు కూడా ఉండేందుకు అవకాశమే లేదు. కాబట్టి జిల్లా స్థాయి అధికారులు ఈ పని మీదే ఉన్నారు.టెట్ మార్కుల్లో మార్పులు చేర్పులకు అవకాశం ఇచ్చారు. ఇలా చేయడం ఇదే తొలిసారి. చాలా మంది టెట్ మార్కులు తప్పుగా వేశారని గుర్తించిన అధికారులు స్కోర్ కార్డు ప్రకటించిన తర్వాత కూడా టెట్ మార్కులు సవరణకు అవకాశం ఇచ్చారు. దీని కారణంగా ఫైనల్ స్కోర్‌లో మార్పులు జరగొచ్చు.ఇప్పుడు టెట్‌లో క్వాలిఫై కాని అభ్యర్థులు కూడా టెట్ క్వాలిఫై అయినట్టు చెప్పుకొని పరీక్షలు రాశారు. కొందరు తప్పుగా మార్కులు నమోదు చేశారు. వీళ్లందరికి మరో అవకాశం ఇచ్చేందుకు టెట్ మార్కులు ఎడిట్ ఆప్షన్ ఇచ్చారుతప్పులు సవరించుకోవడానికి గడువు ఇచ్చినందుకున ఆ తర్వాతే మెరిట్ లిస్ట్‌ను తయారు చేస్తారు. తప్పులు కరెక్షన్ చేసిన తర్వాత జిల్లా, జోనల్ స్థాయి మెరిట్ జాబితాను సిద్ధం చేస్తారు. అనంతరం వాటిని వెబ్‌సైట్‌లో పెట్టనున్నారు. అనంతరం ఆగస్టు 17 తర్వాత సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు సమయం కేటాయిస్తారు.సర్టిఫికెట్ వెరిఫికేషన్ అయిన తర్వాత ఉద్యోగాలు వచ్చిన వారి పూర్తి జాబితాను అధికారులు వెబ్‌సైట్‌లో పెట్టనున్నారు. అలా ఫైనల్ లిస్ట్‌లో పేర్లు ఉన్న వాళ్లు కౌన్సెలింగ్ నిర్వహించి స్కూల్స్ ఎంచుకునే అవకాశం కల్పిస్తారు. ఆ ప్రక్రియ పూర్తి అయన తర్వాత వాళ్లకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇవ్వనున్నారు. ఇది ఆగస్టు చివరి వారాంతానికి పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ముందుగా 17 నాటికి అపాయింట్మెంట్ ఆర్డర్లు ఇస్తామని అన్నారు కానీ అది ఇప్పుడు సాధ్యమయ్యేలా కనిపించడం లేదు.

## కొత్తగా సుధార్ మార్ట్‌లు

**విశాఖపట్టణం – సూర్యవాస్తవం:** ఏపీ ప్రభుత్వం వినూత్న నిర్ణయాలు తీసు కుంటోంది. దాదాపు అన్ని శాఖల పరిధిలో స్వతంత్ర నిర్ణయాలు ఉంటున్నాయి. అందులో భాగంగా జైళ్ళ శాఖ ఆధ్వర్యంలో సుధార్ మార్టులు ఏర్పాటు అవుతు న్నాయి. విశాఖ సెంట్రల్ జైలులో ఖైదీల జీవితాల్లో మార్పు కోసం జైళ్ల శాఖ వీటిని ఏర్పాటు చేస్తోంది. అక్కడ ఖైదీలు తయారు చేసిన వస్తువులు, కూరగాయలు తక్కువ ధరకి లభిస్తాయి. దుప్పట్లు, బెడ్ షీట్లు, బ్లీచింగ్ పౌడర్, కేకులు, కూరగాయలు వంటివి మార్కెట్ ధర కంటే తక్కువకు అందుబాటులో ఉన్నాయి. అయితే ఈ మార్టుల ద్వారా లభించే డబ్బును ఖైదీల సంక్షేమానికి ఉపయోగిస్తారు. సుధార్ మార్టుగా పిలిచే.. ఈ దుకాణాల్లో కూరగాయల నుంచి కేకుల వరకు? దుప్పట్ల నుంచి బ్లీచింగ్ పౌడర్ వరకు చాలా తక్కువ ధరకే విక్రయిస్తారు. ఏపీ జైళ్ల శాఖ తీసుకున్న ఈ నిర్ణయం మంచి ఫలితాలు ఇస్తోందివిశాఖలోని సెంట్రల్ జైల్లో ఖైదీల జీవితాల్లో మార్పు తెచ్చేందుకు జైళ్ల శాఖ అడుగులు వేస్తోంది. శిక్ష పడిన ఖైదీలకు వృత్తి విద్యలో శిక్షణ ఇస్తున్నారు. వారు తయారు చేసిన వస్తువులు, పండించిన కూరగాయలను, పండ్లను, జైలు అవసరాలకు వాడుతున్నారు. మిగిలిన వాటిని సుధార్ మార్ట్ ద్వారా తక్కువ ధరలకు స్థానికులకు అందిస్తున్నారు. ఖైదీలలో మార్పులు తెచ్చేందుకు జైళ్లలో వారితో అనేక రకాల పనులు చేయిస్తుంటారు. స్వయం ఉపాధికి శిక్షణ కూడా ఇస్తుంటారు. ప్రస్తుతం విశాఖ సెంట్రల్ జైల్లో వివిధ వస్తువుల తయారీలో ఖైదీలకు శిక్షణ ఇస్తుండడం విశేషం. కంప్యూటర్ శిక్షణతో పాటు వాహనాల మెకానిక్, వెల్డింగ్ వంటి కోర్సుల్లో కూడా శిక్షణ ఇస్తున్నారు. చదువుకోవాలనే వారికి దూరవిద్య ద్వారా పరీక్షలు రాయిస్తున్నారు.అందులో భాగంగానే ఈ సరికొత్త మార్టులు. ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు తాజా కూరగాయలతో పాటు అన్ని రకాల వస్తువులు ఇక్కడ దొరుకుతున్నాయి.. దీంతో నగరవాసులు ఎక్కువగా ఇక్కడికి వచ్చి కొనుగోలు చేస్తున్నారు. జైళ్ల శాఖ అధికారుల ఆలోచనను అభినందిస్తున్నారు.అయితే ఇక్కడ తాజా కూరగాయలు ఎక్కువగా లభిస్తుండడంతో జనాలు ఎగబడుతున్నారు. పైగా బయట మార్కెట్ ధర కంటే తక్కువగా లభిస్తున్నాయి ఇక్కడ. రసాయనాల ప్రమేయం లేకుండా ఖైదీలు కూరగాయలు పండిస్తుంటారు. అలా వారు పండించిన ఆకుకూరలు, వంగ కాకర, ఆనప, టమోటా, ఆగాకర, దొండకాయ, బెండకాయ, మునగ కాడలు, క్యారెట్, బీట్రూట్, చిక్కుడుకాయ, బీరకాయ, పొట్లకాయ, ముల్లంగి మొదలైన వాటిని విక్రయిస్తున్నారు. అయితే విశాఖ లాంటి నగరంలో రైతు బజార్లు అందుబాటులోకి వచ్చినా అవి చాలడం లేదు. అయితే ఈ సుధార్ మార్టుల్లో తాజా కూరగాయలు లభిస్తుండడం.. బయట ధర కంటే తక్కువగా ఉండడంతో ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు.



# అన్నదాతలకు అండగా నిలుస్తున్న కూటమి ప్రభుత్వం

**- రైతన్నల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం: సూళ్లూరుపేట ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ**

**నాయుడుపేట –సూర్య వాస్తవం, ఆగస్టు 13:** రైతన్నల అభివృద్దే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. బుధవారం నాయుడుపేట పట్టణంలో సూపర్ సిక్స్ –సూపర్ హిట్ కార్యక్రమంలో భాగంగా రైతు సంబర సభను నిర్వహించారు.ఈ సందర్భంగా పట్టణంలోని పిచ్చిరెడ్డి తోపు వద్ద గల విజయ గణపతి ఆలయం వద్ద నుండి గాంధీ మందిరం,బజారు వీధి,దర్గా రోడ్డు, అంబేద్కర్ విగ్రహం,శ్రీకాళహస్తి బైపాస్ రోడ్డు మీదుగా ఏఎంసీ కార్యాలయం వరకు భారీ ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు.అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు.కూటమి ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందని తెలియజేశారు.రైతులను ఆదుకోవడంలో భాగంగా అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు.మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ పరిపాలనా దక్షత గల రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభివృద్ధి,సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలియజేశారు.జనసేన పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్చార్జ్, నాయుడుపేట ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ లు సూపర్ సిక్స్ పథకాలలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తుండడంతో కూటమి ప్రభుత్వం ప్రజల మన్ననలు అందుకుంటుందని తెలియజేశారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఏటా 20,000 రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం 5000 రూపాయలు, కేంద్ర ప్రభుత్వం



2000 రూపాయలు కలిపి మొత్తం 7000 రూపాయలు మొదటి విడత రైతుల ఖాతాలో జమ చేయడం జరిగిందని తెలియజేశారు. రాష్ట్రవ్యాప్తంగా 49 లక్షల మంది రైతులు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా లబ్ధి పొందినట్లు తెలియజేశారు.నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ మాట్లాడుతూ అభివృద్దే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారని, అలాగే ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ప్రజల మన్ననలు అందుకుంటున్నారని తెలియజేశారు.ఈ కార్యక్రమం లో సూళ్లూరుపేట ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి,తెలుగుదేశం పార్టీ నాయకులు కట్టా వెంకటర మణారెడ్డి, నెలవల రాజేష్, పేరంశెట్టి శ్రీరాం ప్రసాద్, సన్నారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి,సంచి కృష్ణయ్య, విజయ్ కుమార్ నాయుడు,నానబాల సుబ్బారావు, అవధానం సుధీర్, చిట్టేటి చెంచయ్య,పరస రాజా, కాపు లూరు చక్రపాణి,పలుకూరు ముత్యాలయ్య,బల్లి ముత్యాలయ్య, మొండెం బాబు, చెందేటి సుజాత, తుపాకుల కన్నెమ్మ,సంపూర్ణమ్మ,పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.



### వరకట్న మరణం కేసులో

# ముద్దాయికి 10 సంవత్సరాలు జైలుశిక్ష

**- రాజంపేట 3వ ఏడీజే కోర్టు తీర్పు వెలువరింపు**
**- గుడ్ ట్రయల్ మానిటరింగ్ వ్యవస్థ బలోపేతం**

**అన్నమయ్య బ్యూరో – సూర్యవాస్తవం, ఆగస్టు 13:** అన్నమయ్య జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు పర్యవేక్షణలో జిల్లా పోలీసులు వరకట్న మరణం కేసు ముద్దాయిలకు కఠిన శిక్షల కై గట్టి చర్యలు చేపట్టారు. రాజంపేట సబ్ డివిజన్ నందలూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని, నందలూరు టౌను బ్రాహ్మణ వీధికి చెందిన పామూరి సాయి వర్ధన్, తండ్రి వెంకటేశ్వర్లు,(వయసు 25 సంవత్సరాలు) అను అతను తన భార్య అయిన పామూరి లక్ష్మీ ప్రసన్న (22సం,, లు) ను అదనపు కట్నం కోసం వేధించడంతో భర్త వేధింపులు తాళలేక 29/04/2023 వ తేదీన మధ్యాహ్నం సుమారు 12.30 గంటల సమయంలో లక్ష్మీ ప్రసన్న తన చున్నీతో ఉరి వేసుకుని చనిపోయినట్లు మృతురాలి తండ్రి రావూరు కనకరత్న ఆచారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు, అప్పటి నందలూరు ఏఎస్ఐ జె.వి. సుబ్బరాయుడు 29/4/2023వ తేదీన కేసు నమోదు



చేశారు. అప్పటి రాజంపేట డిఎస్పీ, జి.శివ భాస్కర్ రెడ్డి , , వి. ఎన్.కె. చైతన్య డిఎస్పీ సాక్షులను విచారించి, సాక్షాదారాలను సేకరించి, దర్యాప్తు చేసి సమగ్ర నివేదికను కోర్టుకు సమర్పించారు. సదరు నివేదికను రాజంపేట 3వ ఏ.డి.జె కోర్టు విచారణ జరిపి సదరు ముద్దాయికి శిక్ష విధించారు.

**ముద్దాయి వివరాలు:** పామూరి సాయి వర్ధన్, తండ్రి వెంకటేశ్వర్లు, (వయసు 26 సంవత్సరాలు) బ్రాహ్మణ వీధి, నందలూరు టౌన్ మరియు నందలూరు మండలం అన్నమయ్య జిల్లా అన్ని కోణాల్లో విచారించిన రాజంపేట 3వ ఏ.డి.జె కోర్టు జిల్లా అడిషనల్ న్యాయమూర్తి శ్రీ.యస్. ప్రవీణ్ కుమార్ పైన తెలిపిన ముద్దాయికి "10 సంవత్సరాల " జైలుశిక్ష విధిస్తూ నేడు తీర్పు వెలువరించారు.

ముద్దాయికి శిక్ష పడటంలో కృషి చేసిన ప్రస్తుత పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీ.కె.వేణుగోపాల్ మరియు అప్పటి పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.యం.డి. జానీ భాష ని, అప్పటి దర్యాప్తు పోలీసు అధికారులను, సాక్ష్యులను సమయానికి కోర్టుకు హాజరు పరిచేలా చేస్తూ, కోర్టు ట్రయల్ ని పర్యవేక్షిస్తున్న రాజంపేట రూరల్ సీఐ బి.వి రమణని, నందలూరు యస్.ఐ, వి.మల్లికార్జున రెడ్డిని, కోర్టు కానిస్టేబుల్ (పిసి.1216) బి. వెంకటరమణ నాయక్‌ని అన్నమయ్య జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు అభినందించారు. వరకట్న మరణానికి కారణం అయిన ముద్దాయికి కోర్టు తీర్పు ఒక గుణపాఠం కావాలని జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు ఐపియస్ పేర్కొన్నారు.

### శ్రావణమాసంలో

# పెరిగిన చికెన్, మటన్ ధరలు

**విశాఖపట్టణం– సూర్యవాస్తవం:** ఆంధ్రప్రదేశ్‌లో శ్రావణమాస శోభ కనిపిస్తోంది.. మహిళలు పూజల్లో, వరలక్ష్మి వ్రతాల్లో బిజీగా ఉన్నారు. అయితే ఆనవాయితీ ప్రకారం శ్రావణమాసంలో చికెన్ రేట్లు, గుడ్ల రేట్లు తగ్గాలి.. కానీ ఈసారి విచిత్రంగా ధరలు పెరిగాయి. ఏపీలోని పలు జిల్లాల్లో చికెన్ ధరలు గత శ్రావణ మాసంతో పోలిస్తే పెరిగాయట. ఫారం దగ్గర కిలో కోడి మాంసం ధర మాత్రం రూ.220కి చేరింది. రెండు వారాల కిందట ఈ ధర రూ.170 మాత్రమే ఉందంటున్నారు. శ్రావణమాసంలో కోళ్లను మాంసం కోసం అమ్మడంతో గుడ్ల ఉత్పత్తి మరింత తగ్గింది.. ఎండలు ఎక్కువగా ఉండటం వల్ల కోళ్లు తక్కువ గుడ్లు పెడుతున్నాయి. శ్రావణ మాసంలో రేట్లు పెరగడానికి.. ఉత్పత్తి తగ్గడానికి తోడు రాష్ట్రంలో శుభకార్యాలు ఉండటమే కారణం అంటున్నారు.ఇక కోడిగుడ్ల విషయానికి వస్తే.. ఫారం దగ్గర గుడ్డు ధర రూ.5.10కి చేరింది. అయితే ఈ నెల మొదట్లో దీని ధర రూ.4.60గా ఉంది అంటున్నారు. ఇక షాపుల విషయానికి వస్తే.. గుడ్డు రూ.6.50 నుంచి రూ.7 వరకు అమ్ముతున్నారు. గుడ్ల ఉత్పత్తి తగ్గడం వల్ల ధరలు



పెరిగాయని రైతులు అంటున్నారు. డిమాండ్ ఎక్కువగా ఉండటం కూడా ధరల పెరుగుదలకు ఒక కారణం అంటున్నారు. గుడ్ల ధరలు పెరుగుతుండటంతో రైతులు కోళ్లను అమ్మడానికి ఇష్టపడటం లేదు. తూర్పుగోదావరి జిల్లా నుండి ఇతర ప్రాంతాలకు గుడ్లు, మాంసం ఎగుమతి అవుతాయి. గతంలో రోజుకు కోటి గుడ్లు ఉత్పత్తి అయ్యేవి. కానీ ఇప్పుడు ఫారాలు తగ్గడంతో 80 లక్షల గుడ్లు మాత్రమే ఉత్పత్తి అవుతున్నాయివీటికి తోడు కోళ్ల పరిశ్రమకు దాణా ధరలు పెరగడం ఆందోళన కలిగిస్తోందట. నెల రోజుల క్రితం రూ.30 ఉన్న సోయా ధర ఇప్పుడు రూ.42 దాటింది అంటున్నారు. మొక్కజొన్న, వరినూక ధరలు కూడా పెరిగాయి.. ఇథనాల్ పరిశ్రమల్లో వీటి వాడకం పెరగడంతో ఈ పరిస్థితి వచ్చింది అంటున్నారు. కోళ్లు, చేపలు, పశువుల దాణా ధరలు పెరిగాయి.. మొక్కజొన్న, వరి ధాన్యం ఎగుమతి అవుతాయనే వార్తలు పరిశ్రమను కలవరపెడుతున్నాయట. మొత్తం మీద శ్రాణ మాసంలో ఏపీలో చికెన్, గుడ్ల ధరలు పెరగడం ఆసక్తికరంగా మారింది.



PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )